
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 21.02.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com





ఆంధ్రాకు తల తీసి మొండాన్ని మిగిల్చారు

భారత పార్లమెంట్ సాక్షిగా అన్నిపక్షాల సమక్షంలో జాతీయపార్టీలే తలారులై రాజ్యాంగాధిపతుల ఆదేశాలతో...

# ప్రజాస్వామ్యానికి ఉరేసారు!

- దేశంలో నియంతృత్వం రాజ్యమేలింది
- ఇందిరమ్మ కోడలు ఎమర్జెన్సీని మరపించింది
- ఓట్లు, సీట్ల ఆటలో చిక్కుకున్న బీజేపీ
- కనికరం లేకుండా సీమాంధ్రను అనాధను చేసారు
- ఢిల్లీ వీధుల్లో సీమాంధ్రుల ఆర్తనాదాలు అరణ్యరోదనలే
- ఉద్రిక్తతలు, నిరసనల మధ్య పార్లమెంట్ తలుపులు మూసేసి, ప్రసారాలు ఆపేసి చీకటిలో దొంగచాటుగా టీ-బిల్లును ఆమోదించారు.

మరణించిన మనుషులు ఆత్మలుగా మారడం నిజమైతే, వారి ఆత్మలు స్వర్గంలోకి చేరి భూలోకంలో మనం చేస్తున్న పనులు చూడడం నిజమైతే... 18వ తేదీ భారత పార్లమెంట్‌లో చోటుచేసుకున్న చీకటి దృష్టాంతాలను చూసి మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్‌వల్లభ్‌భాయ్‌పటేల్, డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, శ్రీమతి ఇందిరాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయుల ఆత్మలు ఇప్పటికీ రోదిస్తూనే ఉంటాయి. భారత పార్లమెంట్‌ను ఇలాంటి దుస్థితిలో చూడడానికా మేము స్వాతంత్ర్యం కోసం పోరాడింది. రాజ్యాంగాన్ని రచించి అమలు చేసింది అని ఘోషిస్తుంటాయి. మహమ్మదీయులు, ఆంగ్లేయులను మేలనిపించే నియంతృత్వ పాలనను ఈ దేశానికి అందించడానికా తెల్లదొరలను దేశం నుండి తరిమికొట్టింది అని మదనపడుతుంటాయి. (మిగతా 10వ పేజీలో)



విభజన ఆటలో నెగ్గలేక...

## కెప్టెన్ రిటైర్డ్ హర్ట్

- రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం
- కిరణ్ కొత్త పార్టీపై నేతల ఆశలు

**పైలీన్ తుఫాన్‌ను అడ్డుకోలేకపోయాను గాని విభజన తుఫాన్‌ను మాత్రం అడ్డుకుంటానన్న ఆయన మాటలు ఆచరణరూపం దాల్చలేకపోయాయి. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడానికి ఆయన చేసిన ఏ ఒక్క ప్రయత్నం ఫలించకుండా పోయింది. చివరికి ఒకటిమాత్రం నిజమైంది. రాష్ట్ర శాసనసభ తిరస్కరించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే తన పదవినే వదులుకుంటానన్నాడు. అది మాత్రం జరిగింది.**

రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి 19వ తేదీ రాజీనామా చేసారు. సీఎం పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వానికి కూడా ఆయన రాజీనామా చేసారు. 19వ తేదీ ఉదయం క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి కిరణ్ తన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. అనంతరం నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి తన రాజీనామాను సమర్పించారు. కిరణ్ తర్వాత కాంగ్రెస్ అధిష్టానం ఇంకెవరినీ ముఖ్యమంత్రిగా పెట్టకుండా రాష్ట్రపతి పాలన విధిస్తే సమైక్య రాష్ట్రానికి ఆయనే చివరి ముఖ్యమంత్రి అవుతాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇక కాంగ్రెస్‌పార్టీ కాల గర్భంలోకి కలిసిపోయే అవకాశముంది కాబట్టి ఆ పార్టీ పరంగా చివరి ముఖ్యమంత్రి బహుశా ఆయనే.

సెప్టెంబర్ 2, 2009న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో వై.యస్.రాజశేఖరరెడ్డి మరణించడం వల్ల ఇద్దరు నాయకులకు అనూహ్యంగా సీఎం కుర్చీలు దక్కాయి. వారిలో ఒకరు రోశయ్య అయితే, రెండోవారు కిరణ్‌కుమార్‌రెడ్డి. వై.యస్. మరణం తర్వాత కాంగ్రెస్ అధిష్టానం రోశయ్యను ముఖ్యమంత్రిగా నియమించింది. అయితే ఆయన పరిపాలనలో రాష్ట్రం ఎన్నో ఒడిదుడుకులకు లోనైంది. ఆయన హయాంలోనే తెలంగాణ ఉద్యమం చెలరేగింది. వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఓదార్పుయాత్రలు చేపట్టి కాంగ్రెస్ అధిష్టానానికి కడుపు మండించాడు. ఈ వ్యతిరేక పరిస్థితులలో పాలన సాగించలేక 2010 నవంబర్ 24న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. ఆ సమయంలో సీఎం రేస్‌లోకి చాలా మంది నాయకులే రాగా స్పీకర్‌గా వున్న కిరణ్‌కుమార్‌రెడ్డిని సీఎం పదవి వరించింది. వివాదరహితుడిగా పేరుండడం, యువకుడు (మిగతా 10వ పేజీలో)

నెల్లూరు పార్లమెంటుకు ఆదాల

## తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ


వార్త 10వ పేజీలో



శ్రీశైల మల్లన్న సేవకి

## ఆదినారాయణుడు


వార్త 10వ పేజీలో



● సర్వేపల్లి

## ఆనం, ఆదాల, మేకపాటి, సోమిరెడ్డి

# అందరి టార్గెట్ కాకాణే!



**ఇది నమ్మలేని నిజం. నేటి రాజకీయనేతల ఇజం. అవతల వ్యక్తి తమ స్వంత పార్టీవాడైనా సరే అవసరమైతే శత్రువులతో చేతులు కలిపైనా ఓడించాలన్నది ఈ నేతల నైజం. రాబోయే ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో ఇలాంటి దృశ్యమే మనకు కనిపించబోతుందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. శత్రువుకి శత్రువు మిత్రుడన్న ఫార్ములాతో వై.యస్.ఆర్.సి.పి. నుండి పోటీ చేయనున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఓడించడానికి పార్టీలతో సంబంధం లేకుండా చేతులు కలపడానికి నేతలు వ్యూహం పన్నుతున్నారన్నది రాజకీయ మేధావులు చెప్తున్న జోస్యం.**

ఆనం వర్గం వ్యక్తిగా ముద్రవేసుకుని వై.యస్. ఆశీస్సులతో జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి 2009 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి అసెంబ్లీ టిక్కెట్ ఆశించి భంగ పడ్డాడు. వాస్తవానికి కాకాణికి ఆత్మకూరు టిక్కెట్ ఇచ్చేది లేదని అప్పటి ముఖ్యమంత్రి దివంగతనేత డా॥ వై.యస్.ఆర్ తమ ముఖ్యఅనుచరుడి (రాజకీయాలకు సంబంధంలేని వ్యక్తి)చేత చెప్పి పంపించినా, ఆనం రామనారాయణరెడ్డి తనకు హామీ ఇచ్చాడంటూ ఆశలు పెట్టుకున్నాడు గోవర్ధన్‌రెడ్డి.

వై.యస్. తాను చెప్పినట్లుగానే టిక్కెట్ ఇవ్వలేదు. అప్పట్లో అలిగి తెలుగుదేశం వైపు మొగ్గుచూపిన కాకాణిని పిలిపించుకుని బుజ్జగించి సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చాడు. అప్పటినుండి ఆనం వారు తనని మోసం చేశారంటూ వారిపై కత్తి దూశాడు గోవర్ధన్‌రెడ్డి. ఇవన్నీ ప్రజలెరిగిన సత్యాలే.

అనుకోని రీతిలో మహానేత మరణంతో ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీతో పోరాడి స్వంత పార్టీ ప్రారంభించడంతో జగన్ వెంట నిలిచిన గోవర్ధన్‌రెడ్డికి పార్టీలో అగ్రస్థానం ఇచ్చి జిల్లా కన్వీనర్‌గా జగన్ నియమించాడు.

ఇక్కడే అసలు కథ మొదలైంది. అయిదు సంవత్సరాలు జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా పరిపాలనలో తనను తాను రుజువు చేసుకోవడమే కాకుండా, యువకుడిగా ఉత్సాహవంతుడిగా తనకంటూ ఒక వర్గాన్ని తనదంటూ ఒక బలగాన్ని ఏర్పరచుకున్నాడు గోవర్ధన్‌రెడ్డి. జిల్లాలో వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీకి సమర్ధ నాయకుడిగా ఆయన ఎదిగాడు. అయితే ఆ ఎదుగుదలే ఆయన పాలిట ఇప్పుడు శాపమయ్యేటట్లుంది.

మొదటి నుండి వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా మేకపాటి గౌతమ్ పేరు వినపడుతూనే వుండేది. గౌతం తండ్రిగా రాజమోహన్‌రెడ్డికి జగన్ పెద్దపీట వేశాడు. వయసులో కూడా పెద్దవాడు కావడంతో పార్టీలో పెద్దరికాన్ని అప్పజెప్పి జిల్లాలో కూడా ఆయనకు కొంత ప్రాధాన్యతను కల్పించాడు. అయితే ఇదే అదనుగా జిల్లాలో కాకాణికి వ్యతిరేకంగా ఒక వర్గాన్ని మేకపాటి కుటుంబం ప్రోత్సహిస్తూ వచ్చింది. కానీ జగన్ మిగిలిన నాయకుల్లాంటివాడు కాదు కాబట్టి ఓవైపు మేకపాటికి విలువిస్తూనే కాకాణి ప్రాధాన్యతను ఎక్కడా తగ్గనీయకుండా కాపాడుకుంటూ వచ్చాడు. జిల్లా కన్వీనర్ పదవి తమ వారికి కావాలని మేకపాటి పట్టుపడితే కాకాణిని రాష్ట్ర పార్టీలోకి తీసుకుని కన్వీనర్ పదవి నుండి తొలగించాడు. ఇక జిల్లాలో ఎక్కువశాతం కాకాణి బలపరచిన అభ్యర్థులనే నియోజకవర్గ కన్వీనర్లుగా నియమించాడు. పదేపదే జగన్ నిర్వహించిన సర్వేల్లో సైతం ఒక్క సూళ్లూరుపేట తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో కాకాణి చెప్పిన అభ్యర్థులే విజయబాటలో వున్నారన్నది తేలిపోవడంతో వారివైపే జగన్ మొగ్గుచూపించాడు. ఇక సూళ్లూరుపేట విషయానికొస్తే ఇక్కడ నెలవల కన్నా సంజీవ్ గట్టి అభ్యర్థి కావడంతో ఆ ఒక్క నియోజకవర్గం మేకపాటి ఇష్టానుసారం సర్వేల ఫలితాల ప్రకారం సంజీవ్‌ని వరించింది.

వెంకటగిరి, నెల్లూరురూరల్, నెల్లూరు నగరంలలో తమ వర్గం వారికి టిక్కెట్లు ఇప్పించుకోవాలన్న మేకపాటి ప్రయత్నం ఫలించలేదు. నెల్లూరు పార్లమెంటుతో పాటుగా ఆత్మకూరు, ఉదయగిరి మేకపాటి కుటుంబసభ్యులకే వదిలేయడంతో ఇక ఎక్కువగా మాట్లాడే అవకాశం కూడా వారికి లేకుండాపోయింది. పార్టీ ఆవిర్భావంలోనే జిల్లాలో మేకపాటి, కాకాణి రెండు వర్గాలుగా ఏర్పడడంతో ఆది నుండీ రాజకీయంగా పెద్దగా చతురత, చాణక్యత తెలియని మేకపాటి కుటుంబం కంటే కాకాణివైపే ఎక్కువమంది మొగ్గు చూపడం మేకపాటికి మింగుడు పడని విషయం.

ఈ నేపథ్యంలోనే రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా కాకాణిని ఓడించాలన్న ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు ప్రచారం. ముఖ్యంగా ఆనం వారిని ఎదిరించి వారిపై మాటల దాడికి దిగిన కాకాణిపై సోదరులు ఆగ్రహావేశాలతో వుండడమే కాకుండా తాము పెంచిన మొక్కే నేడు మానై తమపై తిరగబడడం వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సోమిరెడ్డితో చేయి కలిపి కాకాణిని ఓడించాలన్నది వీరి ధ్యేయంగా కనిపిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఆత్మకూరులో మేకపాటి గౌతంపై రామనారాయణరెడ్డి పోటీ చేయబోతున్నా అక్కడకు ఇక్కడకు సంబంధం లేకుండా సర్వేపల్లిలో మాత్రం అందరికీ కామన్ ఎనిమీగా కాకాణిని టార్గెట్ చేయబోతున్నట్లు రాజకీయ మేధావులు చర్చించుకోవడం గమనార్హం.

ఇటీవల కాలంలో ఆనంతో సోమిరెడ్డి తరచూ మాట్లాడడం వీళ్ళిద్దరూ ఒకరిపై ఒకరు మాటల అస్త్రాల్ని సంధించుకోవడం తగ్గించడం ఇవన్నీ ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. మరోవైపు కాకాణితో ఎలాంటి (మిగతా 5వ పేజీలో)

## కావలికే బీద



బీద మస్తాన్‌రావు మళ్ళీ కావలి నుండీ పోటీ చేయడం ఖాయమనిపిస్తుంది. మొదట నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావును పెట్టాలని చంద్రబాబు నిర్ణయించారు. మస్తాన్ అయితే గట్టి అభ్యర్థి కావడంతో పాటు బలహీనవర్గాల కోటాలో సీటు కూడా ఇచ్చినట్లవుతుందని, బి.సిల ఓట్లను పొందవచ్చునని భావించారు. అయితే లోక్‌సభ నుండి పోటీకి బీద మస్తాన్‌రావు విముఖత చూపించారు. ఆయన కావలి అసెంబ్లీ నుండి మళ్ళీ పోటీ చేయడానికే ఇష్టపడ్డారు. అయితే ఈమధ్య ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీలోకి వస్తుండడంతో లోక్‌సభకు అభ్యర్థి కొరత తీరినట్లయ్యింది. ఆదాల లోక్‌సభకు పోటీ చేస్తే బీద మస్తాన్‌కు లోక్‌సభ భారం తప్పినట్లే!

## నెల్లూరీయుల గుండెల్లో... ముల్లు గుచ్చారు



***నిజంగా ఇది సిగ్గుచేటు... రాష్ట్ర విభజనతో సీమాంధ్రకు తీరని అన్యాయం జరుగుతుంటే, ఇది ఏం న్యాయమని ప్రశ్నించలేని ప్రజాప్రతినిధులు మన జిల్లా వాళ్లైనందుకు మనమంతా సిగ్గుతో తల దించుకోవాల్సిందే!***

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకున్నది మొదలు సీమాంధ్రలోని ప్రజాప్రతినిధులందరూ తలోరకంగా సమైక్యాంధ్ర ఉద్యమంలో పాలుపంచుకున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు విభజనను గట్టిగా వ్యతిరేకించారు. అధిష్టానాన్ని ఎదిరించలేని నాయకులు సీమాంధ్రకు న్యాయం చేయాలని కోరారు. విభజనపై తొలుత ప్రేక్షకపాత్ర పోషించిన కావూరి సాంబశివరావు, పురంధేశ్వరి, పల్లంరాజు, చిరంజీవి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వంటి వాళ్లు కూడా విభజన బిల్లు లోక్‌సభకు వచ్చిన సమయంలో చురుకుగా వ్యవహరించారు. సీమాంధ్రకు న్యాయం చేయాలంటూ గట్టిగా పోరాడారు. కాని ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్టానానికి లోబడిపోయి విభజనను వ్యతిరేకించడం మాట అటుంచితే, కనీసం సీమాంధ్రకు న్యాయం చేయండని అడగని కేంద్రమంత్రులు, ఎంపీలు కొందరున్నారు. వారిలో మన జిల్లాకు చెందిన పనబాకలక్ష్మి, చింతా మోహన్‌లు ఉండడం చింతించాల్సిన విషయం. లోక్‌సభలో జరిగిన సీమాంధ్రుల నిరసనలలో వీరు పాల్గొనలేదు. 13వ తేదీ విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పుడు గాని, 18వ తేదీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గాని సీమాంధ్ర ఎంపీలు, కేంద్రమంత్రులు పెద్దఎత్తున నిరసనగళం విప్పారు. కాని వీళ్లిద్దరు మాత్రం బెల్లంకొట్టిన రాయిలా తమ సీట్లలోనే ఉలుకుపలుకూ లేకుండాపోయారు. రాష్ట్రం విడిపోయింది... ఈ విభజన మంటలు కొన్నాళ్లకు చల్లారిపోవచ్చు. కాని నెల్లూరుజిల్లా వాళ్లకు ఈ సందర్భం గుర్తొచ్చినప్పుడల్లా పనబాక, చింతా మోహన్‌లు కళ్ల ముందు మెదులుతూనే ఉంటారు.

## తిరగబడుతున్న... తెలుగు తమ్ముళ్ళు







***జెండాలు మోసాం, జిందాబాద్‌లు కొట్టాం, అధికారపార్టీ వాళ్ల చేతుల్లో కష్టాలు అనుభవించాం, పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచాం, పార్టీ కార్యక్రమాలంటే పరుగులు తీసాం, అప్పులు చేసో అడుక్కుతినో జెండాలు కొని ఫ్లెక్సీలు కట్టాం, పార్టీ కార్యక్రమాలకు జనాల్ని తోలాం... ఇన్నిరోజులు మేము కష్టం చేస్తే, ఇంతకాలం పార్టీ కోసం మేము ఇళ్లు, ఒళ్లు గుల్లచేసుకుంటే ఎన్నికల సమయానికి మమ్మల్ని కాదని అవతల పార్టీల నుండి వచ్చే ఎల్లయ్య, పుల్లయ్యలకు సీట్లిస్తారా? ఇదేనా మీ నీతి... ఇదేనా మీ రీతి... ఇదేనా మీ విశ్వసనీయత...? ఇదేనా మీ ధర్మబద్ధత... అంటూ జిల్లా తెలుగుదేశం తమ్ముళ్లు తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును ప్రశ్నిస్తున్నారు. నాయకులు వై.యస్.ను ఎందుకు నమ్ముతారో, చంద్రబాబును ఎందుకు నమ్మరో ఇప్పుడు తెలుసుకుంటున్నారు.***

జిల్లా తెలుగుదేశం పార్టీలో అసమ్మతి మంటలు ఎగిసిపడుతున్నాయి. దీనికి కారణం పార్టీని కనిపెట్టుకుని వున్న పాత నాయకులను పక్కనపెట్టి కొత్తగా వచ్చే వారికి సీట్లిస్తారనే ప్రచారం రావడమే. ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసారు. వీరు ముగ్గురు తెలుగుదేశంలో చేరడం ఖాయమైపోయింది. పార్టీలో చేరడం వరకు బాగానే వుందిగాని వీళ్ళ ముగ్గురికి టిక్కెట్లు ఖాయమనే ప్రచారం ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలలో గుబులురేపుతుంది. నెల్లూరు నగరం సీటు ముంగమూరుకు ఖాయమని తెలుస్తుంది. అయితే ఈ సీటుపై ఎంతోకాలంగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆశలు పెట్టుకుని ఉన్నాడు. చాలా ఏళ్ల నుండి నగరంలో పార్టీ ఎత్తిపోయినా పదిమందిని కూడదీసుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది శీనయ్యే. నందమూరి బాలకృష్ణ తనకు సీటు ఇప్పిస్తాడనే నమ్మకంతో శీనయ్య ఉన్నాడు. కాని తీరా ఎన్నికలు సమీపించేసరికి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పార్టీలోకి వస్తుండడంతో శీనయ్య ఆశలకు గండిపడే పరిస్థితి వచ్చింది. దీంతో ఆయన బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కే పరిస్థితి వచ్చింది. కోవూరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి రెండేళ్లుగా పార్టీ కార్యక్రమాలు చూస్తున్నాడు. అంతో ఇంతో ఖర్చు పెట్టుకున్నారు. పార్టీ కార్యకర్తలతో సంబంధాలు పెంచుకున్నారు. అయితే ఇప్పుడు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలోకి వస్తుండడంతో ఇక్కడా అసమ్మతి సెగలు రేగుతున్నాయి. పోలంరెడ్డికి కోవూరు సీటు ఖరారు చేసారనే వార్తలతో కార్యకర్తలు మండిపడుతున్నారు. మొన్నటిదాకా కాంగ్రెస్‌లో వుండి తెలుగుదేశం కార్యకర్తలను అణచివేసిన పోలంరెడ్డికి పార్టీ టిక్కెట్ ఎలా ఇస్తారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. పోలంరెడ్డికి సీటిస్తే మేమంతా పార్టీని వీడిపోతామని హెచ్చరిస్తున్నారు. అయితే ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఈ సమస్య లేకపోవడం గమనార్హం. తెలుగుదేశంకు లోక్‌సభ అభ్యర్థి కావాలి. లోక్‌సభకు పోటీ చేయడానికి పార్టీలో ఎవ్వరూ సుముఖంగా లేరు. కాబట్టి ఆదాల లోక్‌సభకు పోటీ చేస్తానంటే చంద్రబాబు పళ్లెంలో పెట్టి సీటిస్తాడు. లేదు ఇప్పుడున్న సర్వేపల్లి నుండి పోటీ చేస్తానన్నా అడ్డం లేదు. కాని నెల్లూరు రూరల్ సీటు కావాలంటే మాత్రం సోమిరెడ్డి అడ్డుపడొచ్చు. మొత్తానికి కొత్త నాయకుల రాకతో తెలుగుదేశంలో కలకలం మొదలయ్యింది.



## అవును...
# వాళ్ళిద్దరూ విడిపోయారు!



**ఒకరి వెంట అధికారగణం - ఇంకొకరి వెంట అభిమానజనం**
**నిన్న అన్నీ పంచుకున్నారు - నేడు అన్నింటిని తెంచుకున్నారు**

అవును వాళ్ళిద్దరూ విడిపోయారు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలకు తామిద్దరము రెండుకళ్ళలా వుంటూ అభివృద్ధిబాటలో నడిపించాం అంటూ నిన్నటి వరకూ మైకుల ముందు ఊదరగొట్టిన శాసనసభ్యులిద్దరూ ఇప్పుడు విడిపోయారు. ఎక్కడ ఏ ప్రారంభోత్సవం జరిగినా శంకుస్థాపన చేసినా తప్పనిసరిగా జంటగా హాజరయ్యే ఈ ఇద్దరు యమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇప్పుడు ఎవరికి వారే యమునాతీరేగా వ్యవహరిస్తున్నారు.

నిజానికి చిరంజీవి తన ప్రజారాజ్యం పార్టీతో దగాపడి కాంగ్రెస్‌లో విలీనం చేయకముందు సైతం వీళ్ళిద్దరిదీ గట్టి బంధమే. 2009 ఎన్నికలలో అనిల్‌కుమార్‌యాదవ్‌ని ఎలాగైనా ఓడించాలనే “ఆనం” మార్క్ రాజకీయాలతో వివేకానందరెడ్డి ఎన్నికలకు ముందే శ్రీధర్‌కృష్ణారెడ్డితో దోస్తీ చేశాడన్నది అప్పట్లో వాళ్ళు వీళ్ళు చెవికొరుక్కున్న విషయం. కాలక్రమంలో ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడంతో వీళ్ళిద్దరి బంధం పవిత్రబంధంగా మారి బలపడింది.

నగరాన్ని రెండు విభాగాలుగా విభజించి ఇద్దరూ పంచుకున్నారు. మూడవ వ్యక్తికి అవకాశం లేకుండా అభివృద్ధి పనులన్నీ తమ స్వంతం చేసుకున్నారు. తమ విధేయురాలికి మున్సిపల్ పనులన్నీ ఆనం అప్పగిస్తే తన సమీపబంధువుకి ఆర్‌అండ్‌బి ఇరిగేషన్ పనులతో పాటు అరాకొరా మునిసిపల్ వర్కులు ముంగమూరు ఇప్పించుకున్నాడు. ఇద్దరూ కలసి రెండు నియోజకవర్గాల అభివృద్ధి కోసం సమన్యాయం ఫార్ములాతో ఎవరికి కావలసిన పనులు వాళ్ళు కానించేసుకున్నారు.

ఇక్కడ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కొంచెం లౌకికం ప్రదర్శించాడనే చెప్పవచ్చు. ఆనం సీనియర్ కావడం ఆయన తమ్ముడు కీలకశాఖకు మంత్రిగా వుండడంతో అధికారులు మొత్తం ఆనం తానా అంటే వాళ్ళు తందానా అన్న రీతిలో పనిచేస్తున్నారన్న వాస్తవాన్ని ముంగమూరు గ్రహించాడు. అందుకే ఎక్కడా సహనం కోల్పోకుండా సంయమనం పాటిస్తూ చక్కగా తన పనులను చక్కదిద్దుకున్నాడు.

ఇక ఆనం, ముంగమూరుల బినామీలు టెండర్లు వేస్తున్నారంటే ముందుకు వచ్చి వారికి పోటీపడే ధైర్యం ఎవరికీలేదు, కాదని ఎవరన్నా వచ్చినా వాళ్ళు చేసే పనికి డబ్బులురావు, సంవత్సరాల తరబడి బిల్లులు పెండింగ్‌లో వుండిపోతాయి. ఈ వాస్తవాలని గ్రహించే వీరికి ఎదురుగా ఎవ్వరూ రాలేదు.

ఇప్పుడు తాజాగా జరిగిన జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం గూటికి చేరిపోయాడు. ఇప్పటికీ నగరంలో అలాగే రూరల్‌లో శంకుస్థాపనలూ ప్రారంభోత్సవాలూ జరుగుతూనే వున్నాయి, కానీ ఈ కార్యక్రమాలలో ఇప్పుడు ఒక్క శాసనసభ్యుడే పాల్గొంటున్నాడు. నిన్నటి వరకు జంట కవుల్లా ఇద్దరు శాసనసభ్యులూ వీరికి చేదోడు వాదోడుగా నగర మాజీ మేయర్ పాల్గొంటుండిన కార్యక్రమాలన్నీ ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

ఆనం అధికార పక్షం వాడు కావడంతో ఆయన కార్యక్రమాలకు అధికారగణం మొత్తం ఫైళ్ళు చంకలో పెట్టుకుని హాజరవుతున్నారు. ఇక ముంగమూరు అధికార పార్టీకి రాజీనామా చేసేసినా ఇంకా యం.యల్.ఏగా కొనసాగుతున్నాడు కాబట్టి ఆయన అడపాదడపా చేస్తున్న ప్రారంభోత్సవాలకు శంకుస్థాపనలకూ తన సొంత క్యాడర్‌తో పాటు తమ కుటుంబ అభిమానగణం ఆయనతో పాటుగా పాల్గొంటున్నారు.

అందరూ అనుకుంటున్నట్లుగా వీళ్ళిద్దరూ ప్రస్తుతం విడిపోయినా రాబోయే ఎన్నికలతో ఇతర పార్టీలతో పాటు కాంగ్రెస్‌పార్టీ పోటీకి పెట్టే వ్యక్తులను బట్టి మళ్ళీ అంతర్గతంగా ఒక్కటై గెలుపోటములు నిర్ణయించడానికి కృషిచేసే అవకాశాలు కూడా కొట్టిపారేయలేమంటున్నారు ఈ ఇద్దరినీ దగ్గరగా చూసిన ఇరువర్గాల అనుయాయులు.

ఇన్నాళ్ళూ ఈ ఇద్దరూ ఒకరికి ఒకరు తోడుగా ఒకరితో ఒకరు నీడగా కలసి వుంటే కలదు సుఖం అన్నట్లుగా పనిచేసిన తీరును గమనించిన రెండు నియోజకవర్గాల ప్రజలు నేడు వీరి తీరును చూసి అవాక్కవుతున్నారు. చూద్దాం రాబోయే రోజుల్లో వీళ్ళు మళ్ళీ గెలిచి ఒక్కటిగా నిలుస్తారో లేక మాజీలుగా మిగిలిపోతారో అని గుసగుసలాడుకుంటున్నారు.

# కాంగ్రెస్‌ను వీడిన మాగుంట



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పదవికి, కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసారు. రాష్ట్ర విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే ఎంపీ పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని ఆయన ఇటీవలే ప్రకటించారు. అనుకున్నట్లే చేసారు. కాంగ్రెస్‌పార్టీ సిడబ్ల్యూసిలో విభజన నిర్ణయం తీసుకున్నాక రాజీనామా చేయడానికి ఆయన వెనుకాడారు. అయితే విభజనపై కేంద్రం పట్టుదలగా ముందుకు పోవడంతో, సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి విభజనకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ 14న లోక్‌సభలో జరిగిన ఘటనల నేపథ్యంలో సస్పెండ్ అయిన సభ్యుల్లో ఆయన కూడా ఉన్నారు. మాగుంట శీనయ్య రాజీనామాతో కాంగ్రెస్‌తో మాగుంట కుటుంబానికి ఉన్న అనుబంధానికి ఇక్కడితో తెరపడినట్లయ్యింది. 1992లో మాగుంట సుబ్బరామరెడ్డి ఒంగోలు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా రాజకీయ రంగప్రవేశం చేసారు. ఆ ఎన్నికలలో గెలిచిన ఆయన ఒంగోలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేసారు. 1995లో ఆయన నక్సలైట్ల చేతిలో హత్యకు గురికాగా, 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఆయన సతీమణి మాగుంట పార్వతమ్మ ఒంగోలు లోక్‌సభ నుండి విజయం సాధించారు. 1998ఎన్నికలలో మాగుంట పార్వతమ్మ బదులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు నుండి పోటీచేసి గెలిచాడు. తిరిగి 1999లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోయాడు. ఆ తర్వాత 2004, 2009ఎన్నికల్లో శీనయ్య ఒంగోలు లోక్‌సభ నుండి గెలిచాడు. ఇప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసాడు. ఇంకో పార్టీలో చేరుతాడా, లేక రాజకీయాల నుండి పూర్తిగా నిష్క్రమిస్తాడా అనేది చూడాలి.

## • ఆత్మకూరు - వెంకటగిరి
# గౌతం జోరు - కొమ్మి పోరు





వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి ఆత్మకూరు వెంకటగిరి నియోజకవర్గాలలో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఆత్మకూరు నుండి టిక్కెట్ ఆశించిన కొమ్మి లక్ష్మయ్య నాయుడిని వై.యస్.ఆర్.సి.పిలోకి రంగప్రవేశం చేయించింది మేకపాటి గౌతం అయినప్పటికీ గౌతం అంటే కొమ్మికి పడడంలేదు. సీనియర్ రాజకీయవేత్తగా తన మాటనే నెగ్గించుకోవాలనే పంతంతో కొమ్మి లక్ష్మయ్య గౌతం పట్ల నిర్లక్ష్యదోరణితో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటికి 4సార్లు కొమ్మి ఇంటికి గౌతం వెళ్ళినా కొమ్మి ఇంట్లో లేకపోగా కనీసం గౌతంని కలవడానికి కూడా ఇష్టంచూపడంలేదని వై.యస్. కాంగ్రెస్‌పార్టీ అభిమానులు వాపోతున్నారు. అసలు కొమ్మిని జగన్ పంచన చేర్చిందే తమ నాయకుడని ఇప్పుడు కొమ్మి వ్యవహరిస్తున్న తీరు విడ్డూరంగా వుందని అక్కడివారు ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తున్నారు.

సీనియర్ రాజకీయవేత్తగా, మాజీ శాసనసభ్యుడిగా కొమ్మి లక్ష్మయ్యకు గత చరిత్ర చాలానే వుంది. చంద్రబాబుని సైతం ఎదిరించి మాట్లాడి నీ టైం బాగుంది సి.యం అయ్యావు అంతేకాని నువ్వేం పెద్ద పొడిచే నాయకుడివికాదు అని నేరుగానే విమర్శించిన సంఘటన అందరికీ తెలిసిందే.

ఇక అధికారులపై చెయ్యిచేసుకోవడం, కలెక్టర్‌తో కయ్యానికి కాలుదువ్వడం కొమ్మి రాజకీయ ప్రస్థానంలో అతి సాధారణమైన విషయాలు. రాజకీయ నాయకుడిగా ఆయనకు ప్రజలలో మంచిపేరు కూడా వుంది. చిన్న ఫైలైనా చంకన పెట్టుకుని సచివాలయంలో ప్రతి టేబుల్ వద్దకూ వెళ్ళి అడిగిన వారి పనిని సాధించడంలో దిట్ట. తాను ఎన్నికలలో పోటీ చేసినప్పుడు అనేక గ్రామాల ప్రజలు తమకు తోచిన ఆర్థికసాయం కూడా కొమ్మికి అందించి అండగా నిలిచారు. ఇలాంటి రికార్డు కూడా జిల్లాలో ఒక్క కొమ్మికి మాత్రమే వుంది.

జిల్లా నాయకత్వం మొత్తాన్ని గౌతమ్ చేతుల మీదుగా నడిపించాలనుకున్న జగన్‌కి ఆత్మకూరు, వెంకటగిరి విషయాలలో కొంచెం తలబొప్పికడుతుందనడానికి ముఖ్య కారకుడు కూడా కొమ్మే. ఈయన గౌతంతో కలిసి రావడంలేదు. వెంకటగిరిలో మేకపాటి సమీప బంధువులు తనకు మద్దతు ఇవ్వడంలేదనే నెపం పెట్టుకుని ఆత్మకూరు నియోజకవర్గంలో తనకున్న పలుకుబడిని గౌతం కోసం ఉపయోగించకపోగా గౌతం వెంట నడుస్తున్న తనవర్గం లేదా తన సామాజికవర్గం వారిని కొంచెం గట్టిగానే మందలిస్తున్నట్లు తెలుస్తోంది.

చిన్న వయస్సులో తొలిసారిగా రాజకీయాలలోకి అడుగుపెట్టిన గౌతంకి ఎవరితోనూ తగువు పెట్టుకునే నైజంలేదని, అందరినీ కలుపుకుపోవాలనే తత్వంతోనే కొమ్మి ఇంటికి పదేపదే వెళ్ళాడని, కాని లక్ష్మయ్య మాత్రం తన ధోరణి మార్చుకోవడంలేదని గౌతమ్ అనుయాయులు అంటున్నారు.

ఇటీవల గూడూరులో బసచేసిన జగన్ కూడా కొమ్మికి క్లాస్ పెరికాడని అయినా కొమ్మిలో ఇసుమంతైనా మార్పులేదని చెప్తున్నారు. గౌతంబాబులాంటి వ్యక్తితో తగువు కొమ్మికి సరికాదని ఆయన వైఖరి ఆయనకే కాకుండా పార్టీకి సైతం నష్టం కలిగిస్తుందని ఆవేదన చెందుతున్నారు. రాజకీయాలలో సుదీర్ఘ భవిష్యత్తుని కాంక్షించి నిస్వార్థ సేవలు అందించాలనే లక్ష్యంతోనే గౌతంబాబు జిల్లా రాజకీయ రంగంలో ఆరంగేట్రం చేశాడని, జిల్లాలో సీనియర్లు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, కుళ్ళు రాజకీయాలు తమ యువనాయకుడికి చేతకాదని గౌతం ఫ్యాన్స్ ఖరాఖండీగా చెప్తున్నారు.


కొమ్మి వైఖరిలో మార్పువస్తే అది అందరికీ మంచిదని మొండిగా ప్రవర్తిస్తే అందరికంటే ఎక్కువగా కొమ్మి నష్టపోతాడన్నది ఈ రెండు నియోజకవర్గాల, వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల అభిప్రాయం.

# ఏది కొత్త రాష్ట్రం... ఎవరు అభివృద్ధిచెందారు...?

తెలంగాణ అభివృద్ధికాలేదు, మేమంతా వెనుకబడిపోయాం అంటూ పిచ్చివాళ్లలా మొరిగిన కల్వకుర్తి చంద్రశేఖర్‌రావు కుటుంబంతో పాటు డా॥వై.యస్.రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో యం.పిలుగా , యం.యల్.ఏలుగా ఎంపికైన తెలంగాణ బఫూన్‌నాయకులు, ఓట్లే ధ్యేయంగా కోట్లాది గుండెలను కోతకు గురిచేసిన కాంగ్రెస్ అతినేత్ర సోనియమ్మ, బిజెపి “జాన” చిన్నమ్మ సుష్మాస్వరాజ్, రిమోట్ కంట్రోల్‌తో పాలన సాగించి భారతదేశ పరువును గాంధీకుటుంబానికి తాకట్టుపెట్టిన “రోబో” ప్రధాని మన్మోహన్‌సింగ్ రెండుకళ్ళ సిద్ధాంతమంటూ లేఖద్వారా రోత పుట్టించిన చంద్రబాబు అందరూ సమాధానం ఇవ్వాల్సిన ప్రశ్న ఇది. క్రింది విషయాలను గమనిస్తే అసలు తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిందా? లేక వారిచే తరిమివేయబడిన సీమాంధ్ర ప్రజలు ఇప్పుడు కొత్త రాష్ట్రాన్ని ఏర్పరచుకోవాలా? ఈ విషయం విజ్ఞత కలిగిన తెలంగాణ ప్రజలు వివేకవంతులైన తెలంగాణ నాయకులు ఆలోచించుకోవాలి.

| సంస్థలు/అభివృద్ధి | సీమాంధ్ర | తెలంగాణ |
|---|---|---|
| రాజధాని | లేదు | వుంది |
| అసెంబ్లీ | లేదు | వుంది |
| సచివాలయం | లేదు | వుంది |
| హైకోర్టు | లేదు | వుంది |
| అంతర్జాతీయప్రతిష్టాత్మక విమానాశ్రయం | లేదు | వుంది |
| మెట్రో ప్రాజెక్ట్, సాఫ్ట్‌వేర్ కంపెనీలు | లేవు | వున్నాయి |
| అంతర్జాతీయ విద్యాసంస్థలు | లేవు | వున్నాయి |
| ప్రపంచస్థాయి పరిశోధనాలయాలు(లాబ్స్) | లేవు | వున్నాయి |

ఇలా చెప్పుకొంటూ పోతే ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమలు, తెలంగాణలో వున్నాయి. వారికి లేనిది మనకు మాత్రం వున్నది ప్రతిభ ఒక్కటే, కానీ ఆ సమర్ధతను ఇక మనకోసం మనం ఆలోచించాల్సిన పరిస్థితిని తెచ్చుకున్నాం. ఇప్పుడైనా మేలుకుందాం మన ప్రాంతానికి మేలు చేసుకుందాం.




## రాజరికంలో ఉన్నామా?

పార్లమెంటులో ప్రజాస్వామ్య విలువలను తుంగలోతొక్కుతున్న తీరు చూస్తుంటే మనం రాజరికంలో ఉన్నామో, ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామో అర్ధం కావడం లేదు. నిబంధనల ప్రకారం పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాల్సి ఉండగా, గూండాగిరి ద్వారా అడ్డదారుల్లో బిల్లులను ప్రవేశపెట్టాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికేమొచ్చింది. టీ-బిల్లు ఇప్పడు పాస్ కాకపోతే అమెరికా వచ్చి మనమీదేమన్నా బాంబులేస్తుందా?

పావిలేటి శ్రీనివాసులు, ఒంగోలు.

## సోనియా అహంకారం వల్లే!

సోనియాగాంధీ అహంకారం వల్లే విభజన బిల్లు పుట్టుకొచ్చింది. ఆమె అహాన్ని చల్లార్చడం కోసమే కేంద్రమంత్రులు తమ స్థాయిని, విలువలను వదిలేసి పంచాయితీ వార్డు మెంబర్లకన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారు. సోనియాగాంధీ వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఈ రాష్ట్రంలో 9కోట్ల మంది తెలుగుప్రజలు తన్నుకుని చావాలా?

ప్రేమ్‌సాగర్, నెల్లూరు.

## ఆ ప్రకటనలు సరికాదు

పార్లమెంటులో పెప్పర్‌స్ప్రే వదిలిన లగడపాటి రాజగోపాల్‌ను అభినవ భగత్‌సింగ్ అని పొగుడుతూ కొందరు టీవీలలో ప్రకటనలు ఇవ్వడం సమర్ధనీయం కాదు. భగత్ సింగ్ విదేశీయుల మీద పోరాడారు. పార్లమెంటులో ఉండేదంతా భారతీయులే. మనం నిరసన వ్యక్తం చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఈరోజు ఇలాంటి పనులను హీరోయిజంగా చూపిస్తే రేపు ఇంకొకరు తుపాకీ తీసుకుని లోక్‌సభలో కాల్పులు జరుపుతారు. ఇలాంటి పనులు ఎవరు చేసినా తప్పే!

షేక్ ఇబ్రహీం, కావలి.

## ఆటోలపై దృష్టిపెట్టాలి

నెల్లూరునగరం ట్రాఫిక్‌కు 80 శాతం కారణం ఆటోలే! కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ వీటిపై దృష్టి పెట్టి, ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

జె.జె. ఆంజనేయులు, నెల్లూరు.

# 'ప్రభా'తం

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అతిపెద్ద పార్లమెంట్ వ్యవస్థ కూడా మనదే. ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచి మనం. ప్రజాస్వామ్యంలో ఉన్న గొప్పతనాన్ని చాటేదీ మన దేశమే. భారత ప్రజాస్వామ్య వైభవానికి నిలువెత్తు ప్రతీక పార్లమెంటు. ఈ పార్లమెంటు వైపే ప్రపంచ దేశాలన్నీ చూస్తుంటాయి. ఈ పార్లమెంటు వద్ద ఏం జరిగినా ప్రపంచమే దానివైపు ఆశ్చర్యంగా చూస్తుంది. ఎన్డీఏ హయాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పార్లమెంటుపై దాడి చేసినప్పుడు దీనిని ప్రపంచ ప్రజాస్వామ్యంపైనే దాడిగా ప్రజాస్వామ్య దేశాలు అభివర్ణించాయి. భారత పార్లమెంటు పనితీరును ఎన్నో ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటాయి. ఈ పార్లమెంటులో జరిగే చర్చలను వినడానికి, పార్లమెంటులో చట్టాలను తయారుచేసే విధానాన్ని చూడడానికి విదేశీయులు సైతం అతిథులుగా వస్తుంటారు.

ప్రపంచ దేశాలన్నీ ఎంతో గౌరవంగా చూస్తే భారత పార్లమెంటు పరువు గంగలో కలిసింది. మన పార్లమెంట్ ప్రతిష్ట మసకబారింది. ఈ నెల 14వ తేదీన లోక్‌సభలో జరిగిన సీమాంధ్ర ఎంపీలపై దాడులు, ఎంపీ లగడపాటి రాజగోపాల్ పెప్పర్‌స్ప్రే ఘటనలతో పార్లమెంటు ప్రతిష్ట పాతాళానికి పడిపోయింది. జరిగిన మొత్తం సంఘటనలో సీమాంధ్ర ఎంపీ లగడపాటి రాజగోపాల్ పెప్పర్‌స్ప్రే ఉదంతాన్నే నిందిస్తున్నారు. కాని ఒక ఎంపీ ఈ స్థాయికి ఎందుకు దిగజారాల్సి వచ్చిందనేదానిపై విశ్లేషణ జరగాల్సివుంది. ఏ గౌరవ పార్లమెంటు సభ్యుడు కూడా విలన్‌గా ముద్ర వేయించుకోవాలనుకోడు. పదిమందిలో తామూ గౌరవసభ్యుడినని పించుకోవాలనుకుంటాడు. కాని సభలో ఇంత దుమారం ఎందుకొచ్చింది? పెప్పర్‌స్ప్రే వంటి సీన్‌లు ఎందుకు తలెత్తాయన్నదే ప్రశ్న. దీనికి సమాధానం కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరే! పల్లెటూరిలో పంచాయితీకన్నా హీనంగా పార్లమెంట్‌ను దిగజార్చింది కేంద్రప్రభుత్వం. ఒక ప్రాంతానికేమో అడిగినవన్నీ ఇచ్చేస్తూ, ఇంకో ప్రాంతానికేమో కనీసం వారు చెప్పేది కూడా వినకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగానే ఈ పరిస్థితి వచ్చింది.



### ఈ పాపానికి బాధ్యులెవరు?

ఇద్దరన్నదమ్ముల మధ్య ఆస్తుల పంపకాలు జరిగేటప్పడు మధ్యలో ఉన్న అక్షరజ్ఞానం లేని పెద్దమనుషులు కూడా న్యాయం, ధర్మం పాటిస్తారు. అన్నదమ్ముల అంగీకారంతోనే ఆస్తుల పంపకాలు చేస్తారు. కాని ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని పాలిస్తున్న కాంగ్రెస్‌పార్టీలో ఆ దృష్టి లోపించింది.

ఇద్దరన్నదమ్ముల మధ్య ఆస్తుల పంపకాలు జరిగేటప్పుడు మధ్యలో ఉన్న పెద్దమనుషులు న్యాయం, ధర్మం పాటిస్తారు. అన్నదమ్ముల అంగీకారంతోనే ఆస్తుల పంపకాలు చేస్తారు. అక్షరజ్ఞానం లేని పెద్దమనుషులు కూడా ధర్మం, న్యాయం పాటిస్తారు. కాని ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని పాలిస్తున్న కాంగ్రెస్‌పార్టీలో ఆ దృష్టి లోపించింది. న్యాయం, ధర్మం స్థానంలో నిరంకుశత్వం, ఓట్లు, సీట్లు, పక్షపాతం వంటివి చోటుచేసుకున్నాయి. కాబట్టే పార్లమెంటు భ్రష్టుపట్టాల్సివచ్చింది.

అసలు ఆరోజు పార్లమెంటులో జరిగిన సంఘటనలకు ప్రధాన బాధ్యత అధికారపార్టీదే! లోపభూయిష్టంగా విభజన బిల్లును తయారుచేయడం ఒక తప్పయితే దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టిన తీరు మరోతప్పు. విభజన బిల్లుపై కాంగ్రెస్ మొదటినుండి ఒంటెద్దు పోకడలతోనే పోతుంది. ఎంతో ప్రాధాన్యత గల విభజన అంశాన్ని కేంద్రం కేబినెట్ మీటింగ్‌కు టేబుల్ ఐటంగా తేవడంతోనే దాని చిత్తశుద్ధి అర్ధమైపోయింది. విభజన విషయంలో సంప్రదాయాలను ఎక్కడా పాటించలేదు. ఏ కమిటీ నివేదిక ప్రకారం ఈ బిల్లును తయారు చేసారో, రాష్ట్ర విభజనకు ప్రామాణికత ఏంటో కూడా బిల్లులో చెప్పలేదు. రాష్ట్ర శాసనసభకు బిల్లును పంపించడం, బిల్లును శాసనసభ తిరస్కరించిన తర్వాత కూడా అదే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడం, మొదట లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సిన బిల్లును రాజ్యసభలో పెట్టాలనుకోవడం, రాజ్యసభ ఛైర్మెన్ న్యాయసలహా తీసుకుని మొదట రాజ్యసభలో బిల్లు పెట్టడానికి నిరాకరించడంతో లోక్‌సభలో పెట్టాలనుకోవడం జరిగింది. కనీసం బిల్లు పెట్టేరోజు అజెండాలో బిల్లు పెడుతున్నట్లు కూడా పేర్కొనలేదు. ఇక బిల్లు లోక్‌సభలో పెట్టిన తీరు చూస్తే దేశంలో ప్రజాస్వామ్యం నడుస్తుందో గూండాస్వామ్యం నడుస్తుందో అర్ధంకాని పరిస్థితి.

ఆరోజు లోక్‌సభకు బిల్లు వస్తే అడ్డుకోవాలని సీమాంధ్ర ఎంపీలు వ్యూహరచన చేసారు. బిల్లును లాక్కోవడం, చించేయడం, వెల్‌లోకి వెళ్లి నిరసన తెలపడం వీరి ఆందోళనల్లో భాగం. తాము అన్యాయానికి గురవుతున్నామనే బాధతో సీమాంధ్ర ఎంపీలు నిబంధనలను సైతం అధిగమించే విధంగా ఆందోళనకు సిద్ధమయ్యారు. మరి ఇక్కడ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన కేంద్రప్రభుత్వం ఏం చేసింది? సొంత పార్టీ ఎంపీలనే వెల్‌లో మోహరింపజేసింది. హోంమంత్రి, స్పీకర్‌ల చుట్టూ సొంత ఎంపీలతో రక్షణ వలయాలను ఏర్పాటు చేసింది. బిల్లును లాక్కోవడానికి ఎవరు వచ్చినా చావకొట్టే విధంగా తర్ఫీదు ఇచ్చింది. కాంగ్రెస్ అధిష్టానం స్కెచ్ ప్రకారమే లోక్‌సభలో సీమాంధ్ర ఎంపీల మీద దాడి జరిగింది. ఈ సందర్భంలో సీమాంధ్ర ఎంపీ కొనకళ్ల నారాయణ గుండెపోటుకు గురయ్యారు. బజారు రౌడీల మాదిరిగా కాంగ్రెస్ ఎంపీలు సీమాంధ్ర ఎంపీలపై దాడిచేసారు. ఈ గందరగోళం మధ్యనే సభలో బిల్లును పెట్టినట్లు ప్రకటించారు. బిల్లును ప్రవేశపెట్టిన విధానం కూడా సభా సంప్రదాయాలను మంటకలిపే విధంగా వుంది.

ఇక 18వ తేదీన లోక్‌సభలో బిల్లును ఆమోదించిన తీరు చూసి దేశమే నివ్వెరపోయింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించడంతోనే రాజ్యాంగ విలువల పట్ల వీరికి ఏ మాత్రం చిత్తశుద్ధి వుందో అర్ధమవుతుంది. కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులు తెలంగాణ బిల్లుపై చర్చలో పాల్గొన్నారు. ఏ రాష్ట్రాన్నైతే విభజిస్తున్నారో ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీలను సస్పెండ్‌తో బయటపెట్టేసి పార్లమెంటు తలుపులు మూసేసి బిల్లును నెగ్గించుకున్న తీరు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. అడ్డుకున్న ఎంపీలను చావతన్నయినా తెలంగాణ బిల్లును ఆమోదింపజేసుకున్న కాంగ్రెస్‌కు అదే చిత్తశుద్ధి మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎక్కడకు పోయింది. ఆరోజు కూడా అన్ని పార్టీలు మహిళాబిల్లుకు మద్దతు తెలిపాయి. ఆర్జేడీ, ఎస్పీలు మాత్రమే వ్యతిరేకించాయి. కాని ఇంతే పట్టుదలతో ఆ బిల్లును ఎందుకు ముందుకు తీసుకెళ్లలేదంటే... టీ-బిల్లుతో వున్న సీట్ల ప్రయోజనం మహిళాబిల్లుతో లేదు కాబట్టి!

# 'అంతర్'జాతీయం

- దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కేంద్రం సిఫారసు చేసింది. జనలోక్‌పాల్ బిల్లును ఢిల్లీ అసెంబ్లీలో కాంగ్రెస్, బీజేపీలు వ్యతిరేకించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేసారు. అసెంబ్లీని రద్దుచేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్‌సింగ్‌ను కోరారు. అయితే గవర్నర్ అసెంబ్లీ రద్దుకు మొగ్గు చూపకుండా ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు మొగ్గుచూపుతూ కేంద్రానికి నివేదిక పంపారు.
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భారతీయులు ఎవరిని ఎన్నుకుంటే వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా వున్నామని అమెరికా ప్రభుత్వ డిప్యూటీ అధికారప్రతినిధి వీబీ హార్ఫ్ తెలిపారు. ఎన్నికలకు ముందు వివిధ పార్టీల నేతలతో భేటీలో భాగంగానే తమ దేశ రాయబారి నాన్సీపావెల్ బీజేపీ ప్రధాని అభ్యర్థి మోడీని కలిసారని చెప్పారు.
- నైజీరియాలోని ఈశాన్య రాష్ట్రమైన బోర్నోలో సోమవారం ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. ఈ సంఘటనలో వందమందికిపైగా మరణించారు. 'బోకోహరాం' అనే ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తుంది.
- కాందహార్ హైజాక్ ఘటనలో ఉగ్రవాదులు విడిపించుకు వెళ్లిన ఒమర్‌సయీద్ షేక్(41) పాకిస్థాన్ జైలులో ఆత్మహత్యకు ప్రయత్నించారు. వాల్‌స్ట్రీట్ జర్నర్ విలేకరి డానియెల్ పెర్ల్ హత్యకేసులో పాకిస్థాన్ కోర్టు అతనికి ఉరిశిక్ష విధించింది.
- సిద్ధసమాధయోగ ఆద్యులు రిషి ప్రభాకర్ గురూజీ(65) 16వ తేదీ బెంగుళూరులో అనారోగ్యంతో కన్నుమూసారు.
- మాజీప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో మరణశిక్ష పడిన ముగ్గురు దోషులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మురుగన్, శాంతన్, పేరరివాలన్‌లకు పడిన మరణశిక్షను సుప్రీంకోర్టు యావజ్జీవ శిక్షగా మారుస్తూ మంగళవారం తీర్పిచ్చింది. వీరి క్షమాభిక్ష అభ్యర్ధనలు 11ఏళ్లుగా పెండింగ్‌లో వున్నాయి.
- మహారాష్ట్రలోని గోండియా జిల్లాలో 18వ తేదీ తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ జిల్లాలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు, సి-60 కమాండోదళం సభ్యుల మధ్య జరిగిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ఆమె గాంధీ కాదు... గాడ్సే. – సోనియాపై చంద్రబాబు ధ్వజం.
**వ్యాఖ్య :- *అవును... ఆమె గాడ్సేకన్నా డేంజర్‌లాగే వుంది.***

వార్త :- భాజపాది విభజన రాజకీయం. – సోనియాగాంధీ.
**వ్యాఖ్య :- *వాళ్లది మతాల వారీగా... మీది ప్రాంతాలవారీగా విభజన రాజకీయం.***

వార్త :- విభజనలో కాంగ్రెస్ దోషి కాదు. – కేంద్రమంత్రి జేడీ శీలం.
**వ్యాఖ్య :- *హత్య చేసినవాడిని హంతకుడు కాదన్నట్లుంది.***

వార్త :- పీవీ సంస్కరణలు దేశానికి మేలిమలుపు. – అరుణ్‌జైట్లీ.
**వ్యాఖ్య :- *పీవీని మీరు గుర్తించినంతగా సొంతపార్టీ వాళ్లు కూడా గుర్తించలేదు.***

వార్త :- ఏపీలో కాంగ్రెస్ విషపుసాగు. – నరేంద్ర మోడీ.
**వ్యాఖ్య :- *ఇందులో మీ పార్టీ హ్యాండ్ కూడా ఉందిగా!***

వార్త :- సైకిల్ యాత్రకు సన్నద్ధమవుతున్న లోకేష్.
**వ్యాఖ్య :- *సైకిల్ తొక్కడం నేర్చుకుంటున్నాడా?***

వార్త :- పార్లమెంటులో బి.సి రిజర్వేషన్ బిల్లు పెట్టేవరకు పోరాటం. – ఆర్.కృష్ణయ్య.
**వ్యాఖ్య :- *సోనియాగాంధీ చేత హామీ పొందండి. జనాన్ని చంపైనా బిల్లు పెడుతుంది.***

వార్త :- సోనియాకు, పీవీకి సత్సంబంధాలుండేవి కావు. – తాజా పుస్తకంలో కె.వి.థామస్ వెల్లడి.
**వ్యాఖ్య :- *ఆయన కూడా మన్మోహన్‌లా చేతులు కట్టుకుని ఉంటే సత్సంబంధాలుండేవే!***

వార్త :- సోనియా డైరెక్షన్‌లోనే కిరణ్ పార్టీ. – గాలి ముద్దుకృష్ణమనాయుడు.
**వ్యాఖ్య :- *ఆమె డైరెక్షన్, ఇతని యాక్షన్ ఏడ్చినట్లే ఉంటాయి.***

వార్త :- సీమాంధ్రలో కాంగ్రెస్‌ను కాపాడుకుందాం. – బొత్స.
**వ్యాఖ్య :- *ఊపిరిపోయిన పేషంట్‌ను తిరిగి బతికిస్తామన్నట్లుగా ఉంది.***

# భారీగా సిఐల బదిలీలు

గుంటూరు రేంజ్‌లో మంగళవారం మరోసారి భారీగా బదిలీలు జరిగాయి. రేంజ్ పరిధిలో 38మంది సిఐలకు స్థాన చలనం కలుగగా మన జిల్లాలో 17మంది సిఐలను బదిలీ చేసారు. నెల్లూరు ఎస్పీ వద్ద విఆర్‌లో వున్న కె.కోటేశ్వరరావును నెల్లూరు టూటౌన్‌కు, పి.అక్కేశ్వరరావును నాయుడుపేటకు, ఎం.వి.సుబ్బారావును కలిగిరికి, యం.డి.ఉస్మాన్‌ను కావలి టూటౌన్‌కు, బి.టి.నాయక్‌ను నెల్లూరు రూరల్ సర్కిల్‌కు, ఎల్.వెంకటేశ్వర్లును నెల్లూరు సీసీఎస్‌కు, ఎం.బాలసుందరంను సీసీఎస్‌కు, ఎం.శ్రీనివాసరావును దుగరాజపట్నం మెరైన్‌కు, పి.కిషోర్‌బాబును ఇస్కపల్లి మెరైన్‌కు, జి.రమేష్‌ను విఆర్‌కు పంపించారు. నాయుడుపేటలోవున్న ఎన్.రామారావును గుంటూరు సీసీఎస్‌కు, నెల్లూరురూరల్‌లో వున్న వి.సుధాకర్‌రెడ్డిని రూరల్ ఎస్.హెచ్.ఓగా, ఒంగోలు డిటిసిలో ఉన్న కె.నరసింహారావును వెంకటగిరికి, ప్రకాశం ఎస్పీ వద్ద వున్న ఎం.వి.చంద్రశేఖర్‌రావును నెల్లూరు విఆర్‌కు, రేంజ్ విఆర్‌లో వున్న కె.సి.హెచ్.రామారావును వాకాడుకు, వాకాడులో వున్న జి.శ్రీనివాసులును గుంటూరురూరల్ మహిళా పిఎస్‌కు బదిలీ చేసారు.

## ఆనం సోదరులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు

నెల్లూరు మినీబైపాస్‌లోని టిడిపి కార్యాలయంలో ఈ నెల 16న నగర పార్టీ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఆనం సోదరులు అధికారాన్ని చేతిలో పెట్టుకుని తమ ఇష్టమొచ్చిన తీరులో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారితో కలిసి వున్నన్ని రోజులు ప్రియమైన వారిగా లేకుంటే శత్రువుగా చూస్తూ... నానా రకాల ఇబ్బందులకు లోనుచేస్తారని అన్నారు. కేవలం సోనియాగాంధీ తన కుమారుడిని ప్రధాని పదవిలో చూడాలన్న దురాశతో రాష్ట్రాన్ని విభజించిందని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, అంచెల వాణి, అనూరాధ, తిరుమలనాయుడు, జడ్.శివప్రసాద్, పొన్నాల రామచంద్రారెడ్డి, మండవ రామయ్య, శింగంశెట్టి రవిచంద్ర, మురళి, వై.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీ

నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్‌భవన్‌లో ఈనెల16న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న మాదిగ సంఘాల రాజకీయ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పందిటి సుబ్బయ్యమాదిగ మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ, గూడూరు అసెంబ్లీ స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలనే అభ్యర్థులుగా నిలపాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకే తాము మద్దతు ఇస్తామని, తమకు తగిన ప్రాధాన్యతనివ్వకపోతే ప్రతి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. తదుపరి నెల్లూరుగ్రామీణ నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. పల్లాల శ్రీనివాసులు అధ్యక్షుడుగా, మాట్లూరు కృష్ణ ఉపాధ్యక్షుడుగా, సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా, సిద్ధవరపు పెంచలయ్య, కడింపాటి సుబ్బారావు, వన్నెం కుమార్‌లను కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో మాదిగ ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షులు దువ్వూరు పరంధామయ్య, కువ్వారపు నాగేశ్వరరావు, కుడుముల సుబ్బారావు, తాళ్ళూరు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేలబావి మింగింది

కోట మండలం గూడలి పంచాయితీ పరిధిలోని ప్రకాశం కాలనీకి చెందిన చిన్నారులు ధనుష్(7), హోసన్న(5)లు ఈ నెల 17న సమీపంలోని నేలబావిలో దిగి మృతిచెందారు. ప్రకాశం కాలనీకి చెందిన సాంబయ్య, వరలక్ష్మిల కొడుకు ధనుష్, కృష్ణ, లక్ష్మిల కుమారుడు హోసన్నలు ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళు. ప్రతిరోజూ కలిసి ఆడుకునేవాళ్లు. ప్రతిరోజూ వీళ్లు సమీప అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుంటారు. వీళ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి వాళ్ల తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లేవాళ్లు. వారంరోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనలో ఉండడంతో ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. దీంతో పిల్లలు ఆటల్లో మునిగిపోయారు. ధనుష్, హోసన్నలు కూడా ఆటలాడుకుంటూ నేలబావి వద్దకు వెళ్లారు. అక్కడే బావిలో దిగి ఆడుకుంటూ మునిగిపోయారు. ఈ చిన్నారులిద్దరి మరణంతో ప్రకాశం కాలనీ అంతటా విషాదం అలుముకుంది.

## కన్నతండ్రే కామాంధుడు

కన్నకూతురుపైనే అత్యాచారానికి ఒడిగట్టిన ఓ మానవమృగం ఇప్పుడు పోలీసు స్టేషన్‌లో ఊచలు లెక్కపెడుతుంది. తండ్రీబిడ్డలది మాటలతో వర్ణించలేని ప్రేమబంధం. కాని ఆ బంధానికే మచ్చ తెచ్చాడో పాపాత్ముడు. బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాలలోని ఇందిరమ్మ కాలనీలో ఈ అకృత్యం చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన కత్తి లక్ష్మయ్యకు ఒక కూతురు, కొడుకు వున్నారు. చాలాకాలంగా అతనితో భార్య విడిపోయింది. దీంతో కాలనీలో మరో మహిళతో అతను అక్రమసంబంధం పెట్టుకున్నాడు. మంగళవారం పీకలదాకా తాగొచ్చిన లక్ష్మయ్య వీధిలో ఆడుకుంటున్న తన ఆరేళ్ల కూతుర్ని పిలిచి ఆ మహిళను పిలవమని చెప్పాడు. ఈ పాప వెళ్ళి పిలిచినా పనివుందని ఆమె రాలేదు. దీంతో కామం, మద్యంతో కళ్లు మూసుకుపోయిన లక్ష్మయ్య తన కూతురుపైనే అత్యాచారానికి ఒడికట్టాడు. ఈ దుశ్చర్యతో ఆ పాప భయంతో కేకలు వేస్తూ బయటకు రావడంతో స్థానికంగా ఉన్న మహిళలు ఇంట్లోకి వెళ్లి ఆ కామాంధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కన్నబిడ్డలపై ఇలాంటి ఘోరాలకు పాల్పడే నీచులకు వెంటనే ఉరిశిక్ష వేసే విధంగా చట్టాలు చేస్తే బాగుంటుంది. ఓట్ల కోసం బిల్లులు తీసుకురావడానికి చూపించే శ్రద్ధ కేంద్రం ఇలాంటి చట్టాలపై చూపిస్తే మంచిది.

# మారుతున్న... పోలీసు



- వేగం తగ్గుతోంది
- ఫీలింగ్ మారుతోంది
- పనితీరు మందగిస్తోంది
- సాధారణ ఉద్యోగంగా చెలామణి అవుతుంది

***పోలీసు అంటే ఒక బాధ్యత. సమాజానికి భద్రత. పోలీసు అంటే ఒక శక్తి... దేశభక్తి. ఖాకీ యూనిఫాం ఒంటిమీద పడితే అదో థ్రిల్లింగ్. నరనరాల్లో రక్తం వరదగోదావరిలా ప్రవహిస్తుంది. ఒళ్లు పులకరిస్తుంది. నెత్తిమీద పోలీసు టోపీ పెడితే గర్వంతో ఛాతి ఆరు అంగుళాలు పెరుగుతుంది.***

పోలీసు విధిని బాధ్యతగా చూస్తే ఇందులో ఉన్న తృప్తి ప్రపంచంలోనే ప్రముఖ కోటీశ్వరుడికి కూడా రాదు. అదే దీనిని ఓ ఉద్యోగంగా, డబ్బులు సంపాదించే మార్గంగా భావిస్తే మాత్రం ఈ ఉద్యోగంలో సంతృప్తి ఉండదు. ఇదొక తలనొప్పిగా, ఇదొక భారంగా అనిపించడం ఖాయం. పల్లెటూర్లో సామాన్య మనిషి నుండి ఢిల్లీలో రాష్ట్రపతి వరకు రక్షణగా నిలిచేది పోలీసే! అలాంటి పోలీసు ఉద్యోగంలో నిస్తేజం కనిపిస్తుంది. అడుగడుగునా బాధ్యతారాహిత్యం కనిపిస్తుంది. బాధితులకు న్యాయం చేయాలనే తపనపోయి, బాధితులను పీడించే సంస్కృతి పెరుగుతోంది.

కొన్నేళ్ల క్రితం మండల కేంద్రాలలో ఎస్‌ఐలంటే సింహస్వప్నంగా ఉండేది. ఎస్‌ఐ వస్తున్న బుల్లెట్ బైక్ సౌండ్ వింటే రోడ్లమీద జనాలు పక్కకు తప్పుకునే వాళ్లు. ఎస్‌ఐలు ఎంతో ఉత్సాహంగా పని చేసేవాళ్లు. ఎక్కడన్నా గొడవలు జరుగుతున్నాయంటే పరుగులు తీసేవాళ్లు. పేకాట కేంద్రాలు, వ్యభిచార గృహాలు, ఇతర నేర గ్రస్త కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేవాళ్లు. ఇప్పటికే ఆయా గ్రామాలలో గతంలో పనిచేసిన కొందరు ఎస్‌ఐల గురించి గొప్పిగా చెప్పుకుంటుంటారు.

ఆనాటి ఉత్సాహం, పోలీసు పనిలో వున్న వేగం ఇప్పటి పోలీసుల్లో కనిపించడం లేదు. ఎస్‌ఐ ఉద్యోగాన్ని కూడా బ్యాంకులో ఉద్యోగం మాదిరిగా ఫీలవుతున్నారు. కష్టపడి పనిచేయాలనే తత్వమే లేకుండా పోతుంది. ఉద్యోగంలో చేరింది మొదలు ఎక్కడెక్కడ మామూళ్లు వస్తాయనేదాని మీద వెదుక్కోవడానికే సరిపోతుంది. ఎక్కడన్నా గొడవ జరుగుతుందని సమాచారం వచ్చినా, వాళ్లొచ్చి కంప్లయింట్ ఇచ్చినప్పుడు చూద్దాంలే అన్న ధోరణి కనిపిస్తుంది. నేరస్తులకే కాదు బాధితులకు కూడా పోలీసుస్టేషన్ పోవాలంటే జంకే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా పోలీసుశాఖపై రాజకీయ ప్రభావం పెరగడం పోలీసు శాఖలో పనితీరు మందగించడానికి ఒక కారణం. ఇక మానవ హక్కుల సంఘాలు, పౌరహక్కుల సంఘం, మీడియా పెరగడం, సమాచారహక్కు చట్టం వంటివాటి వల్ల కూడా పోలీసుల్లో స్పీడు తగ్గింది. నేరస్తులకు భయం ఉండేటట్లు, ఇంకెవరన్నా నేరం చేయాలనుకుంటే భయపడేటట్లు పోలీసులు నేరస్థులను నడిరోడ్డు మీదే శిక్షించాలనుకుందాం... ఆ సీన్‌లను టీవీల వాళ్లు చూపిస్తారు. మానవహక్కుల సంఘాల వాళ్లు దీనిపై ధ్వజమెత్తుతారు. దాంతో సంబంధిత పోలీసు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. దీనివల్ల ఏమవుతుందంటే, పని చేయాలని, నేరగ్రస్తుల పీచమణచాలనే ఆసక్తివున్న పోలీసు అధికారులు కూడా మాకెందుకొచ్చిన తలనొప్పిలే అనుకుని పోలీసు ఉద్యోగాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం మాదిరిగా చేసుకుంటూ పోతున్నారు. ఇదే సంస్కృతి పెరుగుతూ పోతే ఇంకొంత కాలానికి పోలీసుశాఖ క్రైం రికార్డుల నమోదుకు పరిమితమై, క్రైం నివారణను గాలికొదిలేయడం ఖాయం.

కొత్తగా వచ్చిన ఎస్పీ నవదీప్‌సింగ్ అయినా ఈ పరిస్థితి మార్చాలి.

## పోర్టు భూముల పరిశీలన

వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద ఏర్పాటు చేయనున్న అతిపెద్ద ఓడరేవుకు సంబంధించి భూములను మంగళవారం ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. ఇక్కడ పోర్టు నిర్మాణానికి అవాంతరాలు తొలగిపోవడంతో భూముల సేకరణపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. గూడూరు ఆర్డీఓ మధుసూదన్‌రావు, విశాఖపోర్టు డిజైన్ సర్వే అధికారులు, డివిఫ్‌ఓ అధికారులు పర్యాటకశాఖ అధికారులు మంగళవారం ఇక్కడ భూములను పరిశీలించారు.

## ఆందోళనబాటలో అంగన్‌వాడీలు

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు భారీఎత్తున ఆందోళనకు దిగారు. మంగళవారం నెల్లూరులోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట భారీఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుండి కెవిఆర్ పెట్రోల్‌బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ గంటకుపైగా రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి వచ్చి ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఆందోళన విరమించాలని కోరినా కార్యకర్తలు పట్టించుకోలేదు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శాపనార్థాలు పెట్టారు. ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను, ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిని నానాతిట్లు తిట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏళ్లతరబడి అతితక్కువ వేతనాలతో పనిచేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలు పట్టించుకోవడంలేదని వాపోయారు. మహిళల శాపం తగిలి కాంగ్రెస్‌పార్టీ సర్వనాశనమైపోతుందని వారు శాపనార్థాలు పెట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు నెలకు 12వేలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేసారు. రోబోలా వ్యవహరిస్తున్న ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇప్పటికైనా మనిషిలా మారి తమ సమస్యలను ఆలకించాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి, కార్యదర్శి మస్తాన్‌బీ, నాయకురాళ్ళు శ్యామల, హైమావతి, సుజాతమ్మ, కొండమ్మ, నగరమాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, మాజీకౌన్సిలర్ కత్తి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి టార్గెట్ కాకాణే!

(2వ పేజీ తరువాయి)

వైరం లేనప్పటికీ తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా గెలుపు కోసం సోమిరెడ్డితో పాటు మిగిలిన స్థానిక నేతల సహాయం కూడా తనకు కావాలి కాబట్టి సర్వేపల్లి నియోజకవర్గ మాజీనేతగా ఆదాల కూడా సోమిరెడ్డి విజయానికి కృషి చేసే అవకాశాలు లేకపోలేదు.

ఇవన్నీ గమనిస్తే ఈసారి తెరపైన రాజకీయాల కంటే తెరవెనుక రాజకీయాలే గమ్మత్తుగా వుండబోతున్నట్లు అనిపిస్తోంది. ఓవైపు తమ వియ్యంకులైన మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై పార్లమెంటుకు పోటీ చేస్తూనే మరోవైపు సర్వేపల్లిలో సోమిరెడ్డికి సహకరించడంతో పరోక్షంగా మేకపాటి కోరిక తీర్చే పరిస్థితి ఆదాలకు ఎదురవుతున్నట్లవుతోంది.

రాజకీయాలలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు వుండరనడానికి రేపు సర్వేపల్లిలో జరగబోయే పరిణామాలే పెద్ద ఉదాహరణ. అయితే కాకాణి మాత్రం ఎవరెన్ని కుట్రలు చేసినా విజయం తనదే అన్న ధీమాతో వున్నాడు. డా॥ రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి, ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట నాయకత్వం, కాంగ్రెస్ తెలుగుదేశంపార్టీలు చేసిన ఘోర తప్పిదాలు అన్నిటితో పాటు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా తాను సంపాదించుకున్న గుర్తింపు తన విజయానికి బాటలు వేయబోతున్నాయన్నది ఆయన ధీమా. అంతిమ విజయం అవకాశవాదులదా లేక ఆత్మవిశ్వాసానిదా అన్నది వేచిచూడాల్సిందే.


**IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE: GUNTUR**

**MVOP: 306/12**

Between :
Inkula Poleru ... **Petitioner**
and
Y. Jyothi and 2 others ... **Respondents**

**Notice to R1**

**R1:** Y. Jyothi, W/o. Venkataiah Hindu, R/o. 24-341, Bestapalem, Rajagiri Street, Mulapeta, Nellore.

Whereas the petitioner has filed a claim petition against you and same is posted to **11-3-14** for your appearance. You are here by directed appear before the Hon'ble court either in person or through an advocate duly instructed on **11-3-14** at **10.30 A.M.** Failing which the matter will be heard and decided exparte.

*(By order of the court)*

**VEMULA MALLIKHARJUNA RAO,**
M.Com., B.L.,
Advocate for Petitioner
Guntur. Cell: 98490 06485

# విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకోవాలి

**- డిఇఓ రామలింగం**



విజేతలైన విద్యార్థులతో డిఇఓ మువ్వా రామలింగం

విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకొని మానసికోల్లాసాన్ని పొందాలని జిల్లా విద్యాశాఖాధికారి మువ్వ రామలింగం అన్నారు. ఇటీవల ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ స్పోర్ట్స్‌డేను ప్రారంభించిన సందర్భంగా మువ్వా మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా మనోబలాన్ని ఇవ్వడమే కాకుండా విద్యార్థులలో వుండే సృజనాత్మకశక్తిని బయటకు వచ్చేలా చేస్తాయన్నారు. డాక్టర్ కిషోర్ ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ కిషోర్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ వ్యాయామం, క్రీడలు చిన్నారుల చక్కటి ఆరోగ్యానికి పునాదులని, అందుకే తమ విద్యా సంస్థల్లో అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తొలుత ఎల్‌కేజీకి చెందిన 180మంది విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, యుకేజీకి చెందిన 190మంది విద్యార్థులు చేసిన డ్రిల్ మరియు ఓత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జెన్‌నెక్స్ట్ స్కూల్స్ మేనేజర్ రాజేష్‌బాబు, నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, మేనేజర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్‌గా రేఖారాణి



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా జి.రేఖారాణిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి పి.కె.మహంతి సోమవారం ఉత్తర్వులు జారీచేసారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ జేసీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. గ్రూప్1కు చెందిన అధికారి ఆమె. ఈ నెల 10న స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ నుండి ఐఏఎస్ హోదా పొందారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్హాపూర్‌లో నక్సలైట్లు మందుపాతర పేల్చిన ఘటనలో చనిపోయిన ఐపిఎస్ అధికారి పరదేశీనాయుడు భార్యే రేఖారాణి. కాకినాడ, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్డీఓగా, సాంస్కృతికశాఖ డైరక్టర్‌గా, హౌసింగ్ బోర్డ్ డైరక్టర్‌గా ఆమె గతంలో పనిచేసారు. 2012 ఆగష్టు 5న హైదరాబాద్ జేసీగా బాధ్యతలు చేపట్టి 18నెలల పాటు పని చేసారు. ఇటీవల నెల్లూరుజేసీగా వున్న బి.లక్ష్మీకాంతంను అదిలాబాద్‌కు బదిలీ చేసి నెల్లూరుకు రేఖారాణిని నియమించారు.

# కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా రాజ్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజ్‌కుమార్

జిల్లా అదనపు సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.ఎస్.రాజ్‌కుమార్ నెల్లూరునగర పాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కూడా బాధ్యతలు తీసుకున్నారు. కమీషనర్ జాన్‌శ్యాంసన్, ఇతర కార్పొరేషన్ అధికారులు రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులను ఆయన పరిచయం చేసుకున్నారు.

## నెల్లూరు కబుర్లు

# మాజీ ఆర్థికమంత్రి



ఇప్పటివరకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ఉదయం నుండి మాజీ అయ్యారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లు ఆమోదానికి నిరసనగా బుధవారం ఉదయం ముఖ్యమంత్రి పదవికి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం జరిగింది. దీంతో కేబినెట్ మొత్తం రద్దయ్యింది. 2007లో వై.యస్. కేబినెట్‌లో సమాచారమంత్రిగా మొదలుపెట్టి మధ్యలో మున్సిపల్ శాఖ మంత్రిగా చేసి, ఆర్థికశాఖ మంత్రిగా ఆనం మాజీఅయ్యారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శి
# దామా అంకయ్య

నెల్లూరు జిల్లా సిపిఐ కార్యదర్శిగా దామా అంకయ్య ఎన్నికయ్యారని పార్టీ నేతలు ఈ నెల 15న తెలిపారు. 14న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ అంకయ్యను ఇన్‌చార్జి సెక్రటరీగా నియమించగా ఆయననే జిల్లా నాయకులు పూర్తిస్థాయి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ ఏఐటీయుసి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న తనను సిపిఐ జిల్లా కార్యదర్శిగా నియమించడంతో బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. కొండాపురం మండలం సాయిపేట స్వస్థలమైన దామా అంకయ్య గతంలో కావలి ప్రాంత సిపిఐ కార్యదర్శిగా ఏఐటీయుసి కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా సేవలందించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేస్తూ 2008లో జరిగిన భూ పోరాట ఉద్యమంలో చురుకైన పాత్ర వహించారు.

# మళ్ళీ ఏఆర్ ఎస్పీగా నాగేశ్వరరావు



ఏఆర్ ఏఎస్పీగా ఏ.సి.నాగేశ్వరరావు మళ్లీ బదిలీ అయ్యారు. ఇక్కడ ఏఆర్ ఏఎస్పీగా వున్న ఐ.ఆర్.ఎస్.మూర్తిని విఆర్‌కు పిలిచారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒత్తిడితోనే ఏ.సి. నాగేశ్వరరావు మళ్ళీ జిల్లాకు రాగలిగారు. డిజిపిగా దినేష్‌రెడ్డి ఉన్నప్పుడు ఆనం రామనారాయణరెడ్డితో వున్న విభేదాలతో నాగేశ్వరరావును ఖమ్మంకు బదిలీ చేసారు. అక్కడ ఏఆర్ ఏఎస్పీ పోస్టు లేకపోయినా నాగేశ్వరరావు కోసం సృష్టించారు. అప్పుడు బదిలీని ఆపుకోవడానికి నాగేశ్వరరావు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అప్పుడు సీఎం కిరణ్ కూడా డిజిపికే అనుకూలంగా ఉండడంతో ఆనం ప్రయత్నాలు ఫలించ లేదు.

ఇప్పుడు డిజిపి మారాడు. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీలలో నాగేశ్వరరావు మంత్రి ఆనం ద్వారా ప్రయత్నించి తిరిగి తన సొంత జిల్లాకే రాగలిగాడు.

# ఆస్తులు జప్తు చేయండి

నగరంలో ఆస్తిపన్నులు బకాయిలుంటే ఆస్తులను జప్తు చేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ జాన్‌శ్యాంసన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కార్పొరేషన్ రెవెన్యూఅధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్ళు సక్రమంగా చేయడం లేదంటూ మండిపడ్డారు. నగరపాలక సంస్థకు 14కోట్ల పన్ను బకాయిలుండగా వసూళ్లు మాత్రం నామ్‌మాత్రంగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేసారు. లక్ష్యాలను అధిగమించని ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్లు కార్పొరేషన్‌కు అవసరం లేదన్నారు. రోజుకు 38లక్షలు పన్నుల వసూలు టార్గెట్ ఇస్తే 10నుండి 15లక్షలు మాత్రమే వసూలు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. పన్నులు కట్టనివారిపై కఠినంగా వ్యవహరించాలని, కొళాయి కనెక్షన్లు కట్ చేయడం, ఆస్తులు జప్తు చేయడం చేయాలని ఆయన ఆదేశించారు.

# జడ్పీపిఎఫ్ ఖాతాల కంప్యూటరీకరణ

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రావిడెంట్ ఫండ్(జడ్పీపిఎఫ్) ఖాతాలను కంప్యూటరీకరణ చేస్తున్నారని, చందాదారులైన ఉపాధ్యాయుల వివరాలు సమర్పించమని ముఖ్య కార్యనిర్వాహణాధికారి జితేంద్ర ఈ నెల 15న ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ ఫోటో, నామిని ఫోటో, నామిని పేరు, నామిని వివరాలను మండల, విద్యాశాఖాధి కారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ద్వారా తమ కార్యాలయానికి పంపమని తెలిపారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు వెంటనే జిల్లా విద్యా శాఖాధికారి వెబ్‌సైట్ deonellore.5owelo5.com నుండి నిర్దిష్ట ప్రొఫార్మాను సేకరించి వివరాలను పొందుపరిచి జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపమని కోరారు.

# పుట్టినరోజున చేయూత

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని సేవా కార్యక్రమంలో భాగంగా సభ్యులు పైడిమర్రి శ్రీరంగనాథ్ ఈ నెల 18న నెల్లూరు మూలాపేటలో డెంగ్యూ జ్వర పీడితుడైన బాలుని చికిత్స కోసం రూ॥ 5,000/- ఆర్థిక సహాయం చేసారు.

శ్రీరంగనాథ్ కుమార్తె యశ్విత పుట్టినరోజున ఓ మంచిపని చేయాలన్న ఆలోచనతో ఈ వితరణ చేసినట్టు ఆయన తెలిపారు.

## సండేమార్కెట్‌ోళ్ల
# మంచి నిర్ణయం

నెల్లూరులో పేదోళ్ల షాపింగ్‌మాల్‌గా పేరుగాంచిన సండేమార్కెట్ కమిటీ ఓ మంచి నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వాడకాన్ని నిషేధిస్తున్నట్టు కమిటీ వెల్లడించింది. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ఉచితంగానే వినియోగదారులకు పేపర్ కవర్లను అందిస్తామని తెలిపింది. ప్లాస్టిక్ రహిత నగరంగా నెల్లూరును మార్చేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని నగరంలోని వ్యాపారులందరూ ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వాడకాన్ని మానుకునేందుకు కృషి చేయాల్సివుంది.

## రైలుక్రింద నలిగిన
# పోలీసు ప్రాణం

ఆదివారం రాత్రి నెల్లూరులోని ఆత్మకూరుబస్టాండ్ ప్రాంతంలో రైలుపట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కాకాణి ఉదయ్‌కుమార్(36) అనే కానిస్టేబుల్ మరణించారు. ఆత్మకూరు పంటవీధికి చెందిన ఉదయ్‌కుమార్ ఏ.ఎస్.పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనారోగ్యంతో నెల్లూరు ఉమ్మారెడ్డిగుంటలోని తన సోదరి ఇంట్లో వుంటున్న తల్లిని చూసేందుకు ఉదయకుమార్ నెల్లూరొచ్చాడు. మూత్ర విసర్జన కోసం రైలు పట్టాల వద్దకెళ్లగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.


ఈ నెల 16న డీఐజీగా బదిలీపై వెళ్తున్న గత ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ నుండి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న నవదీప్‌సింగ్

## శ్రీకృష్ణ అవెన్యూలో
# సిమెంట్ రోడ్లకు ఆనం శంఖుస్థాపన



నెల్లూరు హరనాథపురం, శ్రీకృష్ణ అవెన్యూ ప్రాంతాల్లో ఈ నెల 16న నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి సిమెంటు రోడ్డు పనులకు శంఖుస్థాపన చేసారు. ఇప్పటి దాకా ఈ ప్రాంతంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ॥ 9.5 కోట్లు ఖర్చు పెట్టామని, ఇప్పుడు రూ. 56 లక్షల వ్యయంతో మిగిలిన రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. నగరంలోని మిగిలిన ప్రదేశాల్లో కూడా అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ కాంగ్రెస్ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

# భయపెట్టిన వర్షం

ఆది, సోమవారాలలో జిల్లాలో అక్కడక్కడా కురిసిన తేలికపాటి వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేసాయి. వేలాది ఎకరాలలో వరిసాగు కోత కొచ్చే దశలో వుంది. గత ఏడాది వర్షాలు సరిగా లేక రైతులు నానా అగచాట్లు పడి సాగు చేస్తున్నారు. ఈ దశలో వర్షాలు కురిస్తే చేతికొచ్చే పైరు నీటిపాలైనట్లే. వేలాది ఎకరాలలో పంట నష్టం జరుగుతుంది. అంతేకాక మామిడి పూత వేసింది. అకాల వర్షాలతో మామిడిపూత రాలి, దిగుబడి లేకుండా పోతుంది. అయితే తేలికపాటి వర్షాలు కురిసి పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



# మక్కాను తలపించిన ఇజ్‌తిమా

కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వద్ద 500ఎకరాల విశాల ప్రాంగణంలో నిర్వహించిన ముస్లింల పవిత్ర కార్యక్రమం ఇజ్‌తిమా మక్కాను తలపించింది. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ముస్లింలు లక్షలాదిగా తరలి రావడంతో ఇక్కడ పండుగ వాతావరణం నెలకొంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన మత పెద్దలు రావడం, వారి ప్రసంగాలు వినడానికి భక్తులు తండోపతండాలుగా రావడంతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోయింది. నెల్లూరు జిల్లాలో 30ఏళ్ల తర్వాత మళ్లీ ఇజ్‌తిమా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ముస్లిం పెద్దలకు సహకరించారు. ఈ నెల 15, 16, 17తేదీలలో జరిగిన ఇజ్‌తిమాపై విస్తృత ప్రచారం జరిగింది. జిల్లా కేంద్రమైన నెల్లూరునుండి 'ఇజ్‌తిమా' ప్రాంగాణానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపారు. మూడురోజుల్లో కూడా అంచనాలకు మించి భక్తులు లక్షల్లో వచ్చారు. 'ఇజ్‌తిమా'కు వచ్చిన భక్తులతో నెల్లూరు బస్టాండ్, రైల్వేస్టేషన్ కిటకిటలాడాయి. దేశంలోని పలు రాష్ట్రాలు, మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి వేలసంఖ్యలో వాహనాలు నెల్లూరుకు వచ్చాయి. చివరిరోజు జరిగిన 'దువా' కార్యక్రమంలో లక్షలసంఖ్యలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



సింహపురి సమాచారం

రాష్ట్రాన్ని ముక్కలు చేయడం చూసి...


# అతని గుండె ముక్కలైంది

సమైక్యాంధ్ర ఉద్యమంలో మరో పోరాటజ్యోతి ఆరిపోయింది. రాష్ట్రాన్ని ముక్కలు చేస్తున్న దృశ్యాన్ని చూసి అతని గుండె ముక్కలైంది. తుది అంకంలోనైనా విభజనను అడ్డుకోవాలని నెల్లూరుజిల్లాలోని గల్లీ నుండి ఢిల్లీకి వెళ్లిన ఓ ఉద్యమసూర్యుడు ఈ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తున్న దౌర్భాగ్య క్షణాలను చూడకుండానే అస్తమించారు.

ఏపిఎన్‌జీఓల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, మనుబోలు ఎంపిడిఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న దామోదర జోషి సోమవారం ఢిల్లీలో గుండెపోటుతో మరణించారు. సమైక్య ఉద్యమంలో పంచాయితీరాజ్ విభాగం తరపున ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన ఎన్‌జిఓల మహాధర్నాలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ వెళ్లారు. ఇక్కడ ధర్నాలో ఉండగానే ఆయన గుండెపోటుకు గురై మరణించారు.

నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడు చిరమన దామోదర జోషి స్వగ్రామం. ఆయన తండ్రి వృత్తిరీత్యా మనుబోలులో స్థిరపడ్డారు. దామోదరజోషి విద్యార్థి దశ నుండే ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐలో ఉంటూ విద్యార్థుల సమస్యలపై పోరాడారు. టైపిస్ట్ స్థాయి నుండి ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ సంఘాలలో చురుకైన పాత్ర పోషిస్తూ వారి సమస్యల కొరకు జరిగే పోరాటాలలో ముందుండే వాడు. జోషి తండ్రి నరసయ్య, తల్లి యానాదమ్మ ఇద్దరూ ఉపాధ్యాయులే. అతని భార్య మేరివనం కూడా నెల్లూరులోని కెఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. జోషికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. జోషి మృతదేహాన్ని మంగళవారం ఢిల్లీ నుండి విమానంలో రేణిగుంటకు తీసుకువచ్చి అక్కడ నుండి నెల్లూరుకు తరలించారు. జోషి మృతిపట్ల సమైక్యవాదులు, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు తీవ్ర సంతాపాన్ని ప్రకటించాయి.

# ఇటు బాబు... అటు చిరు... మధ్యలో ముంగమూరు





నెల్లూరులో ఈమధ్య చిత్రమైన ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. చంద్రబాబు తెలుగుదేశం అధ్యక్షుడు, చిరంజీవి కాంగ్రెస్‌పార్టీకి చెందిన కేంద్రమంత్రి. ఈ ఇద్దరి ఫోటోలను చెరోపక్క మధ్యలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని పెట్టి నెల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చూపరులను ఆశ్చర్య పరుస్తున్నాయి.

# పెంచలకోన ఇఓగా శ్రీరామ్మూర్తి

పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా శనగవరపు శ్రీరామ్మూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ ఆలయ సహాయ కమీషనర్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసరావును తెనాలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఇఓగా బదిలీ చేసారు. శ్రీరామ్మూర్తి నెల్లూరులోని ధర్మరాజుల స్వామి దేవస్థానం ఇఓగా పనిచేస్తూ కొంతకాలంగా సెలవులో ఉన్నారు. ఆయనను పెంచలకోనకు బదిలీ చేసారు.

# శక్తివంతమైన పాలనతోనే అభివృద్ధి భారతం

## 'శాంతియాత్ర'లో శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ



శక్తివంతమైన, సమర్ధవంతమైన పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని 'దిఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ పేర్కొన్నారు. బెంగుళూరు నుండి ఆయన రైలు ద్వారా నిర్వహిస్తున్న శాంతియాత్ర 17వ తేదీ నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైల్వేస్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారం వద్ద జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్, ఇతర ఉన్నతాధికారులతో పాటు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడే ఏర్పాటు చేసిన వేదికపై నిలబడి ఆయన మాట్లాడుతూ దేశానికి బలమైన ప్రభుత్వం కావాలని, అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దేశ పరిపాలనలో మార్పు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సేవకు ఒక గంట సమయాన్ని కేటాయిస్తే ఈ దేశ స్వరూపమే మారిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాలనలో మార్పు కావాలని కోరుతున్నారని అన్నారు. ఈ సమాజంలో లంచగొండితనం పోవాలని, అందరూ కలిసి వుంటేనే అభివృద్ధి చెందుతామని చెప్పారు. ప్రజలు శాంతి, సహనంతో ఆనందమయ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. గురూజీ ఆద్యంతం తెలుగులోనే ప్రసంగించి భక్తులను అలరింపజేసారు. ఈసారి నెల్లూరులో పెద్ద సత్సంగం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ అవసరం లేని వాటర్ ప్యూరిఫైఫిల్టర్‌ను ఎస్పీ నవదీప్‌సింగ్ చేతులమీదుగా నెల్లూరుప్రజలకు అంకితం చేసారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, రామకృష్ణ, కోట రమేష్‌బాబు, ఇమ్మడిశెట్టి సురేష్‌కుమార్, చలువాది శరణ్‌కుమార్, సత్యనారాయణ, బీజేపీ నాయకులు ఎస్.సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, యం.ఈశ్వరయ్య, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కార్యకర్తలు సక్రమంగా పనిచేయాలి



వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు జిల్లా కలెక్టర్ బంగ్లాలో ఈ నెల 15న జిల్లా వైద్యశాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పిహెచ్‌సి సెంటర్లలో ఆరోగ్య కార్యకర్తలు సక్రమంగా పని చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధించడంలో అధికారులు నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహాన్ని ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు మధ్య తేడాను గర్భిణీలకు తెలియపరచాలని అన్నారు. గర్భిణులను కాన్పు సమయంలో 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించాలన్నారు. వారికి పారితోషకాలను సక్రమంగా, సకాలంలో అందేలా చూడాలన్నారు. విధులను నిర్వహించడంలో అలసత్వాన్ని సహించనని కఠిన చర్యలను తీసుకుంటానని తెలిపారు. ఎప్పటికప్పుడు పిహెచ్‌సీలలో ప్రసవాల వివరాలను తెలపాలని కోరారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కోటేశ్వరి, అదనపు డిఎంహెచ్‌ఓ పద్మావతి, మండలస్థాయి వైద్యాధికారులు పాల్గొన్నారు.

# అద్భుతరీతిలో మైథిలి సైన్స్‌ఫెస్ట్



నమూనాలను పరిశీలిస్తున్న అతిథులు

నెల్లూరు చంద్రమౌళీనగర్ లోని మైథిలీ స్కూల్‌లో ఈ నెల 14న వైజ్ఞానిక ప్రదర్శన "సైన్స్ ఫెస్ట్"ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కోవూరు మండల విద్యాశాఖాధికారి పి.చెంచురెడ్డి మాట్లాడుతూ సైన్స్ మానవ జీవన విధానంలో ఒక భాగమని, ప్రాచీన మానవుడి నుండి నేటి ఆధునిక మానవుడి వరకు జరిగిన జీవన మార్పులు గానీ, అభివృద్ధి గానీ సైన్స్‌ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. నేడు పాఠశాలల్లో కూడా విద్యను నేర్చుకోవడంలో ప్రయోగాలు ముఖ్యభూమికను పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మైథిలీ స్కూల్‌లో నూతన పోకడలను ప్రవేశపెట్టడంతో మిగతా అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మైథిలి స్కూల్ వ్యవస్థాపకులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడం ప్రధానోద్దేశ్యంగా ఈ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ ప్రదర్శనలో ప్లేక్లాస్ నుండి 10వ తరగతి పిల్లల దాకా 360ప్రదర్శనలు ప్రదర్శించగా ప్రతిఒక్కటి ఒక క్రొత్త పరిశోధనలకు మార్గం చూపేలా వున్నాయి. నీటి మార్గాన, భూగర్భం నుండి వచ్చే శత్రువులను రహస్యంగా కనిపెట్టే పెరిస్కోప్, రోప్‌వే, జీవన ఎరువులు తయారుచేసే విధానం, భూగర్భం నుండి విద్యుత్‌ని తయారు చేయడం, పి.యస్.ఎల్.వి. తదితరాలు అచ్చెరువు గొలిపే రీతిలో ప్రదర్శించారు.

## దామోదర్‌కి జయ నివాళి



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సమైక్యాంధ్ర కోసం చేస్తున్న పోరాటంలో అసువులు బాసిన నెల్లూరీయులైన ఎన్జీఓ జేఏసి ఉపాధ్యక్షులు దామోదర్ జోషి కుటుంబానికి యువనేత ఆనం జయకుమార్‌రెడ్డి ఈనెల 18న ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నెల్లూరులోని దామోదరజోషి స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తదుపరి నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద జోషి మృతికి సంతాపసూచకంగా నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు వర్మ, నాగిశెట్టి, ఉద్యమనాయకులు ఏసునాయుడు, బాబునాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, ఆర్ఎస్ఆర్, వెంకటేశ్వర్లు యాదవ్, గార్లపాటి విజయకుమార్, నాగేంద్ర, బుజ్జయ్య, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

గల్పిక 989

దోమల కథలు

# కాంగ్రెస్ ఎంపీలకు మిలిటెంట్ ట్రైనింగ్

భారతదేశాన్ని కులాలు, మతాల వారీగానే కాకుండా ఇప్పుడు ప్రాంతాలవారీగా కూడా విభజించి పాలిస్తున్న ఢిల్లీ మహానగరం. అక్బర్‌రోడ్డులోని టెన్‌జనపథ్ కార్యాలయం. ఓ గదిలో సోనియా గాంధీ, రాహుల్, మన్మోహన్‌సింగ్, షిండే, కమల్‌నాథ్, కేసీఆర్, జైరాంరమేష్, కేసీఆర్, దిగ్విజయ్‌సింగ్, చిదంబరంలు ఉన్నారు. సోనియా ఉండి... రేపు లోక్‌సభలో టీ-బిల్లును ఎలా ప్రవేశపెడుతున్నారు అని అడిగింది. అప్పుడే వి. హెచ్.హనుమంతురావు ట్రేలో టీకప్పులతో అక్కడికి వచ్చి, మేడమ్, టీ తాగుతూ టీ-బిల్లు గురించి మాట్లాడితే మంచి కిక్ ఉంటుందన్నాడు. కేసీఆర్ అందుకు.... కిక్ ఎక్కడానికి ఇదేమన్నా జానీవాకరా... బ్యాగ్‌పైపరా... ఆఫ్ట్రాల్ టీయేకదా అని కసిరాడు. దానికి వి. హెచ్... మేం జానీవాకర్‌లు, బ్యాగ్‌పైపర్‌లు ఇవ్వమండి.... అడిగితే రాష్ట్రాలను ఇచ్చేస్తాం. మా సోనియమ్మ పాలసీ అది అన్నాడు. సోనియా కలుగజేసుకుని... మీ సోది ఆపండి... ముందు నేను అడిగిన దానికి సమాధానం చెప్పండి అని కమల్‌నాథ్‌ను గద్దించింది. వెంటనే కమల్‌నాథ్ తన చంకలో పెట్టుకుని వున్న ఒక ప్లాన్ కాపీని ఆమె ఎదురుగా టేబుల్‌పై పరిచాడు. దానిలో పార్లమెంటు మ్యాప్, దానిలోపల చిత్రాలు ఉన్నాయి. కమల్‌నాథ్ ఒక కర్రను మ్యాప్ మీద పెట్టి చెప్పడం మొదలుపెట్టాడు. మేడం, స్పీకర్ వద్ద బిల్లు పెట్టకుండా సీమాంధ్ర ఎంపీలు అడ్డుకునే ప్రమాదముందని ఇప్పుడే మనకు వేగుగా వ్యవహరిస్తున్న అదే ప్రాంతపు కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. సీమాంధ్ర ఎంపీలను అడ్డుకోవడానికి మూడంచెల వ్యూహాన్ని అమలు చేస్తున్నాను. పార్లమెంటు హాలు బయట ఓ పాతికమంది ఎంపీలను పెడతాను. వాళ్లు అక్కడ నుండి కూడా తప్పించుకుని లోపలకు వచ్చారనుకో... ఈసారి వారు కూర్చునే సీట్ల వద్దే మరో 30మంది ఎంపీలుంటారు. బిల్లు అడ్డుకోవడానికి వాళ్లు ముందుకొచ్చారంటే ముఖం మీద కొట్టి కూర్చోబెడతారు. అక్కడకూడా మిస్సయ్యి వెల్ దాకా వచ్చారనుకోండి... అక్కడ 40మంది ఎంపీలను పెడతాను... సీమాంధ్ర ఎంపీలు వెల్‌దాకా వచ్చారంటే వాళ్ల చావును వాళ్లు కొనితెచ్చుకున్నట్లే! ఇక్కడ మనవాళ్లు సీమాంధ్ర ఎంపీలకు చుక్కలు చూపిస్తారు అని చెప్పాడు. కమల్‌నాథ్ చెప్పిన ప్లాన్ విని సోనియాతో పాటూ రాహుల్, మన్మోహన్‌సింగ్‌లు ఆశ్చర్యపోయారు. మన్మోహన్ వుండి.. కమల్‌నాథ్, పార్లమెంట్ మీద దాడికి అఫ్జల్‌గురు కూడా ఇంత బాగా ప్లాన్ చేసి వుండడని మెచ్చుకున్నాడు. ఏదో మీదయవల్ల అని కమల్‌నాథ్ అన్నాడు. రాహుల్ ఉండి... మీరు సీమాంధ్ర ఎంపీలను అడ్డుకోవడానికి మూడంచెల వ్యూహం అమలు చేస్తున్నారు సరే... మన ఎంపీలు అడ్డుకోగలరా... వారికి అందులో అనుభవం వుందా? వారంతా గట్టివాళ్లేనా? అని అడిగాడు. అప్పుడు కమల్‌నాథ్ వారిని టెన్‌జన్‌పథ్‌లో వెనుకవున్న ప్రాంగణం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ పొన్నం ప్రభాకర్, విజయశాంతి, అజారుద్దీన్, మధుయాష్కీ వంటి తెలంగాణ ఎంపీలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలున్నారు. వాళ్లందరికీ అక్కడ కొందరు మిలిటెంట్ ట్రైనింగ్ ఇస్తున్నారు. సీమాంధ్ర ఎంపీలు వెల్‌లోకి దూసుకువస్తే వారిని అడ్డుకుని కిందపడేసి ఎలా కాళ్లతో తన్నాలి, ఎక్కడెక్కడ కొట్టాలి అనే వాటిమీద రిహార్సల్ నిర్వహిస్తున్నారు. దాదాపు 10నిముషాల పాటూ సోనియా, మిగతావాళ్లు వాళ్ల ట్రైనింగ్ ప్రోగ్రాంను చూసారు. ఆల్‌ఖైదా ఉగ్రవాదులకంటే పట్టుదలతో శిక్షణ తీసుకుంటున్న వారిని చూసి సోనియాకు ఖచ్చితంగా వీళ్లు సీమాంధ్ర ఎంపీలను అడ్డుకుంటారనే నమ్మకం కుదిరింది. సోనియా వుండి... కమల్‌నాథ్‌తో, ఇక రేపు బాధ్యత అంతా నీదే! బిల్లు స్పీకర్ టేబుల్ మీదకు పోవాలి. ఇందుకు ఎంతకైనా తెగించండి అని చెప్పింది. సోనియా మాటలు విని కేసీఆర్ సిగ్గుతో చచ్చిపోయాడు. తెలంగాణతో ఏం సంబంధం లేకపోయినా, అసలు ఇండియాలోనే పుట్టకపోయినా తెలంగాణపై తమకంటే ఎక్కువ ప్రేమ చూపుతున్న సోనియాకు జీవితాంతం ఊడిగం చేసినా తప్పులేదనిపించింది.

★★★★★

ఫిబ్రవరి 13, లోక్‌సభహాల్. మధ్యాహ్నం 12 గంటల సమయం. హోంమంత్రి షిండే విభజన బిల్లుతో వచ్చాడు. సీమాంధ్ర ఎంపీలు మోదుగుల వేణుగోపాలరెడ్డి, లగడపాటి రాజగోపాల్, కొనకళ్ల నారాయణ, కావూరి సాంబశివరావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, హర్షకుమార్, శివప్రసాద్ తదితరులు వెల్‌లోకి దూసుకుపోబోయారు. అక్కడే అలర్ట్‌గా వున్న ట్రైనింగ్ ఎంపీలు వీరిని అడ్డుకుని క్రిందపడేసి చావబాదారు. పిడిగుద్దులు గుద్దారు. కసితీరా కాళ్లతో తన్నారు. ఈ తన్నులు భరించలేక లగడపాటి రాజగోపాల్ తన జేబులో వున్న పెప్పర్‌స్ప్రేను స్ప్రేచేసాడు. ఆ ఘాటుకు ఎంపీలందరూ ఏదో బాంబు పేలినట్లుగా భయంతో బయటకు పరుగులు తీసారు. ఆ తర్వాత అన్ని పార్టీలు పెప్పర్‌స్ప్రే ఘటనను ఘోరాతిఘోరంగా అభివర్ణించాయి. పార్లమెంట్‌పై దాడి చేసిన అఫ్జల్ గురుకు మరణశిక్షను రద్దుచేయాలని నినదించిన నాయకులు కూడా పెప్పర్‌స్ప్రే చేసిన లగడపాటిని మాత్రం ఉరితీయాలంటూ డిమాండ్ చేసారు.

★★★★★

కావూరి సాంబశివరావు ఇంట్లో సీమాంధ్ర ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి స్పెషల్‌గెస్ట్‌గా స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా (64)ను ఆహ్వానించారు. రాయపాటి సాంబశివరావు ఉండి... పెప్పర్‌స్ప్రేతో అందరూ మనల్ని విలన్‌లుగా చూస్తున్నారు. అది స్ప్రే చేయకుండా ఉండాల్సిందన్నాడు. చిరంజీవి అందుకుని... నువ్వేదో ఆఖరున బ్రహ్మాస్త్రం వదులుతానని అంటుంటే బెల్టుబాంబు లాంటిదేదో ప్లాన్ చేసా వనుకున్నా... నువ్వు చెప్పిన బ్రహ్మాస్త్రం ఈ పెప్పర్ స్ప్రేనా అని వ్యంగ్యంగా అన్నాడు. మాగుంట శ్రీనివాసులురెడ్డి వుండి... వివేకా, నువ్వు చెప్పు... మా ప్లాన్ ఎక్కడ ఫెయిలైందంటావు. అని అడిగాడు. అప్పుడు వివేకా... ఇలాంటి ప్రయత్నాలు చేసే ముందు మాలాంటి అనుభవజ్ఞుల సలహాలు తీసుకుని వుంటే బాగుండేది. కాటుకను కళ్లకు పెట్టుకోవాలి, కారాన్ని కూరల్లో వేసుకోవాలి... అలా కాకుండా కారాన్ని కళ్లకు పెట్టుకుంటే ఏమవుతుంది... ఆడోళ్లు వాడే పెప్పర్‌స్ప్రేను లోక్‌సభకు తీసుకుపోతే అలాగే అవుతుంది. మనం ఒక పని చేసామంటే మన చేతికి మట్టి అంటకూడదు. పని పూర్తయిపోవాలి. మీరు లోక్‌సభలో బిల్లును అడ్డుకోవడానికి వెళ్తామని నాతో చెప్పివుంటే, నేను దానికి ప్లాన్ చేసేవాణ్ణి. మీ అందరి జేబుల్లో అరకిలో లెక్కన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ప్యాకెట్లు పెట్టేవాణ్ణి... మీ మీద ఎవరన్నా దాడి చేయడానికి వచ్చినప్పుడు మీరు జేబులో చేయిపెట్టి దోమల కవర్‌ను చించితే చాలు... వాటిల్లో నుండి ముదురుదోమలు బయటకొచ్చి లోక్‌సభలో వున్న ఎంపీల మీద దాడిచేసేవి. మా దోమలు ఒక్కసారి కరిచాయంటే కోలుకోవడానికి వందరోజులు పడుతుంది. బిల్లు పెట్టే హోంమంత్రి, సభను నడిపే స్పీకర్, సభలోని అందరు ఎంపీలు చికున్‌గున్యా, డెంగ్యూ వచ్చి ఆసుపత్రుల పాలయ్యేవాళ్లు. అప్పుడు విభజన బిల్లు మీద చర్చ, ఆమోదం అనేదే ఉండేది కాదు. ఎంపీలంతా కోలుకునేలోపు ఎన్నిక షెడ్యూల్ వచ్చేది. తెలంగాణ అంశం వాయిదా పడివుండేదన్నాడు. వివేకా చెప్పిన మాటలతో సీమాంధ్ర ఎంపీలంతా... అయ్యో ఎంత పొరపాటు జరిగింది... అని నెత్తినోరు బాదుకున్నారు.

★★★★★

కదంబం

## నా చుట్టూ తిరిగే వర్షం

శిఖా ఆకాష్,
నూజివీడు, 9298901571.

వర్షం
సీతాకోకలా నాపై వాలింది
నేనో పువ్వునవుతాను
ముఖం పైకెత్తి
ఆకాశంకేసి చూస్తూ
కురుస్తున్న వర్షాన్ని
సీతాకోకలా ముద్దాడుతున్నప్పుడు
నా కళ్ళల్లో
చల్లని వర్షపు మొగ్గలు
మెత్తగా పరిమళిస్తాయి
ఆనంద అపురూప
పరవశ క్షణాల్లోంచి
అలలు అలలుగా స్వప్నాలు
మరికొన్ని జ్ఞాపకాలు
ఎప్పటికీ తిరిగిరాని
నా పసితనాన్ని నాకు
కానుకగా ఇస్తాయి
బాల్యానికి తెలియని
వర్షం
ఏ దేశంలో నైనా వుంటుందా?
వర్షానికి పరిచయం కాని
బాల్య మెక్కడైనా వుంటుందా!?
వెన్నెల, పువ్వులు
పిల్లలు, పిట్టలు
స్వేచ్ఛా కోకలా నిరంతరం
నా చుట్టూ తిరిగే వర్షం.

# యువతకు దిశానిర్దేశం చేసే బాధ్యత రచయితలదే

- ఏకలవ్య ఫౌండేషన్ అధినేత పి.వేణుగోపాలరెడ్డి




నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరం రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనంలో ఈ నెల 19న 'మహిళలు - మహనీయులు' కార్యక్రమం జరిగింది. నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ సభాధ్యక్షత వహించారు.

నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ మహిళలైన కవయిత్రి మొల్ల, సామాజికవేత్త పొణకా కనకమ్మల స్మృత్యర్థం నిర్వహించిన పై కార్యక్రమంలో విశిష్ఠ అతిథిగా ఏకలవ్య ఫౌండేషన్ అధినేత పి.వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెరసం, రచయితలు రచించిన పుస్తకాలనే కాకుండా, ప్రముఖ రచయితల రచనలను సమాజానికి అందించేందుకు "సాహితీనేస్తం" మాసపత్రిక విడుదల చేయడం ప్రశంసనీయమన్నారు. మరో అడుగు ముందుకేసి జిల్లాలోని ప్రముఖులను గుర్తించి వారు ఏ రంగంలో కృషి చేశారో తెలియజేస్తూ పుస్తకాలు విడుదల చేయాలని సూచించారు. దీనివల్ల జిల్లాలో ఏ రంగంలో ప్రముఖులున్నారో యువతకు తెలుస్తుందని అన్నారు. యువతకు దిశానిర్దేశం చేసే బాధ్యత ముఖ్యంగా రచయితలపైనే ఉందని అన్నారు. కార్యక్రమానికి సబ్‌రిజిస్ట్రార్ ఐ.విజయమణి, సిస్టర్ మరియమ్మ, జస్సంతి, పూడి నరేంద్ర, హెల్పింగ్‌హ్యాండ్స్ కృష్ణారెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొనగా సభానిర్వహణ నెరసం ప్రధానకార్యదర్శి మాటేటి రత్నప్రసాద్ చేసారు.

ఈ సందర్భంగా స్కూలు, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారిని నగదు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. సభానంతరం నిర్వహించిన కవిసమ్మేళనంలో ములుగు లక్ష్మి, సుభద్రాదేవి, ఘాలి లలిత, బొగ్గరపు ఇందిర, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. సభలో ఇందుకూరుపేటకు చెందిన యారాశి రాఘవయ్య రచించిన నానీల పుస్తకాన్ని సబ్‌రిజిస్ట్రార్ ఐ.విజయరాణి ఆవిష్కరించారు.

## "సమైక్య"స్వప్నం విచ్ఛిన్నం

- ఎస్.వి.కృష్ణప్రసాద్, నెల్లూరు. 9949843105

తెలుగుజాతిని చీల్చొద్దంటూ - ఆంధ్రావనిని కూల్చొద్దంటూ
విభజించి పాలించొద్దంటూ - కుటిల రాజకీయ పాపం తెలుగుతల్లికి
శాపం కారాదంటూ
అధికార దాహ క్రీనీడకు స్వస్తి పలకాలంటూ
సమైక్యవాదులను క్షోభ పెట్టొద్దంటూ
బలిదానాలను నిరోధించాలంటూ
విభజన మాటున విచ్ఛిన్నం తగదంటూ
సోదరుల నడుమ చిచ్చు రగల్చొద్దంటూ
దిక్కులు పిక్కటిల్లేలా ఐదు కోట్ల సీమాంధ్ర గళాలు నినదించినా
అష్టప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి తనువులు చాలించినా
చదువులు చట్టుబండలైనా, బ్రతుకులు గడవకున్నా
నౌకరీలకు విఘాతమైనా, నేతలు, గృహిణులు రోడ్డెక్కినా
నోరు జారిన మాటను అడ్డం పెట్టుకొని సమైక్యాన్ని అడ్డంగా విభజించి
జన ఆర్తనాదాలను ఆలకించక, తాంబూలాలిచ్చాం - తన్నుకు చావండంటూ
ఓట్లు సీట్ల కోసం ఒకరి కలను సాకారం చేసి, మరొకరి స్వప్నాన్ని భగ్నం చేయడం
తగునా పాపపు పాలకులారా...
ప్రజాస్వామ్యాన్ని పరిహసించి - రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చి
చట్టసభ సంప్రదాయాలను బుట్టదాఖలు చేసి
పార్లమెంటు ద్వారాలు మూసి మూజువాణి ఓటుతో
రాష్ట్రాన్ని ముక్కలు చేసిన స్వార్థ రాజకీయనాయకులారా ఖబడ్దార్
మీ పదవుల చిరునామాలు
మీవి కాకుండా చేస్తాం
ఓటు గీటురాయితో...

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను, ఇబ్బందులను అధిగమిస్తారు. ఆర్థిక స్థితి మెరుగై ఆదాయం పెరుగుతుంది. లౌకిక వ్యహారాలు, సంప్రదింపులు పరిష్కారానికి వస్తాయి. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి క్రొత్త అవకాశాలు దొరక వచ్చును. షేర్ల మీద, స్థిరాస్తుల మీద ఆదాయం బాగుంటుంది. పట్టుదలకు పోకుండా పనులు సాధించుకొంటే మంచిది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దూకుడుగా వ్యవహరించడం, దూకుడుగా మాట్లాడటం తగ్గించుకొనండి. చిన్న చిన్న సమస్యలు కుటుంబ సభ్యులతో రావచ్చును. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. స్థలాలు, ఇండ్లు కొనుగోలు పై దృష్టి పెడతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. షేర్ల మీద లాభాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి పునరాలోచనలతో నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్థిక వ్యవహారాలను వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతాయి. హామీలకు, ప్రతి వాదనలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారులకు అధికారుల తనిఖీలుంటాయి. కోర్టు వ్యవహారాలలో కొంతే అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

భాగస్వామ్య వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. పొదుపు పథకాలపై నిర్ణయాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో విశ్రాంతి దొరకదు. ఆదాయం బాగుంటుంది. సామాజిక కార్యక్రమాలలో, సమావేశాలలో పాల్గొంటారు. బిడ్డల విద్యా, ఉద్యోగ, వివాహ విషయాలపై దృష్టి పెడతారు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ప్రముఖులను కలుసుకుంటారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
### బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 21.02.2014 నుండి తేది. 27.02.2014 వరకు**

ఈ వారం వేషంలో కేతువు, మిధునంలో గురువు, తులలో శని రాహు కుజులు, ధనుస్సులో శుక్రుడు, 26 తేది నుండి మకరంలో శుక్రుడు, మకరంలో బుధులు, కుంభంలో రవి, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 27 గురువారం
మహాశివరాత్రి

### ముహూర్తములు

ముహూర్తలు లేవు.

### మాఘమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | షష్ఠి | ఉ॥గం.08.27వ॥ |
| తేది. 22 | శని | సప్తమి | ఉ॥గం.07.21వ॥ |
| | పిదప | అష్టమి | పూర్తిగ |
| తేది. 23 | ఆది | నవమి | రా॥గం.04.31వ॥ |
| తేది. 24 | సోమ | దశమి | రా॥గం.02.00వ॥ |
| తేది. 25 | మంగళ | ఏకాదశి | రా॥గం.11.41వ॥ |
| తేది. 26 | బుధ | ద్వాదశి | రా॥గం.09.43వ॥ |
| తేది. 27 | గురు | త్రయోదశి | రా॥గం.06.55వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారవృద్ధికి కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఆదాయం పెరుగుతుంది. సమావేశాలలో మీ సూచనలు ఆమోదింపబడగలవు. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు కొంత లభించడం, అనుకున్న పనులను సాధించుకొనడం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుట, ప్రభుత్వ అనుమతులు, బ్యాంక్ ఋణాలు పొందటం జరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు బాధ్యతల మార్పులు, అధికారులతో సఖ్యత బాగుంటుంది. నూతన వ్యాపారాలు, పెట్టుబడుల మీద దృష్టి పెడతారు. ప్రభుత్వ అనుమతులు ఋణాలు పొందుతారు. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. అనుకున్న పనులను జాగ్రత్తగా నిర్వహించినా చిన్న చిన్న ఇబ్బందులుంటాయి. హామీలివ్వడం చేయవద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకోని ఖర్చుల వల్ల కొంత ఇబ్బంది పడతారు. వృత్తి పరంగా అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. వ్యాపారవృద్ధికి అవకాశాలు అందివచ్చి రాబడి పెరుగగలదు. పనులు, కార్యక్రమాలు హడావిడిగా జరుగుతాయి. అధికారులకు స్థానమార్పు ఉండవచ్చును. షేర్లు మీద స్వల్ప లాభాలుంటాయి. అవసరాలకు మిత్రులు సహాయపడతారు. క్రొత్త వాహనాలు చేకూర్చుకుంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

రాబడి, ఖర్చులు అంచనాలను రూపొందించుకొని ఆర్థిక స్థితిని బాగుచేసుకుంటారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వృత్తి జీవనంలో వ్యాపకం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులను పట్టుదలతో సాధించుకొంటారు. అప్పులు, హామీలిచ్చి చిక్కుకొనవద్దు. విద్యార్థులు గట్టిగా కృషి చేయాలి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఒప్పందాలలోను, చెల్లింపుల విషయంలోను జాగ్రత్త పడండి. వాణిజ్య వృత్తి రంగాలలో జీవనమున్న వారికి ఆర్థికంగా గడ్డు పరిస్థితి. ఖర్చులు బాగా పెరుగుతాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. పనులందు పట్టుదలకు పోకుండా చూసీ చూడనట్లుగా ఉండటం మంచిది. నిర్మాణాలు చేపట్టిన వారికి వర్కర్లతో సమస్యలుండగలవు. అప్పులందు జాగ్రతగా మెలగండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

స్థిరాస్తుల లావాదేవీలు చేస్తారు. రాబడి అసంతృప్తిగా ఉంటుంది. ఇతరుల వల్ల మోసగింపబడటంగాని, ఇబ్బంది పడటంగాని ఉండవచ్చును. అనుకున్న పనులు ఆటంకాలతో సాగుతుంటాయి. ఉద్యోగులకు పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. అనుకోని ప్రయాణాలు, శుభకార్య ప్రయత్నాలు ఫలించడం జరుగుతుంది. షేర్లు నిరుత్సాహపరుస్తాయి. ముఖ్య వస్తువులను జాగ్రత్తగా కాపాడుకొనండి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

క్రొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు, క్రొత్త వ్యాపారాల ఆలోచనలుంటాయి. అనుకున్న పనుల మీద స్థిర నిర్ణయాలు తీసుకొనలేక టెన్షన్ పడతారు. మొగమాటాలుపడి ఇబ్బందులు తెచ్చుకొనే అవకాశం ఉన్నది. వ్యాపార వర్గాలకు ఆదాయం పెరిగి, ఆర్థికంగా బాగుంటుంది. కరెంటు, మిషన్లు, వాహనాలు నడిపే వారు, వాహనాలను రిపేర్లు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో క్రమంగా నిలబడతారు. ఆర్థికముగా అవకాశాలు బాగుంటాయి. ఆస్తి పంపకాలు, ఆస్తుల కొనుగోలు వాయిదా వేయండి. అనుకున్న పనులకు ఆటంకాలు కలుగుతాయి. ఉద్యోగ బాధ్యతలలో మార్పులుంటాయి. పెట్టుబడుల మీద, షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి. దూర ప్రయాణాలు నిర్ణయం కాగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం జరుగుతుంది.

# దారిమళ్ళిన సబ్‌ప్లాన్ నిధులు

నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్ భవన్‌లో చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి దాసు, జిల్లా కార్యదర్శి బండి శ్రావణకుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకొనే విధంగా ఎస్‌సి, ఎన్‌టి సబ్‌ప్లాన్ నిధులను సత్వరం విడుదల చేసి వారి సంక్షేమం కోసం కృషి చేయాలని డిమాండ్ చేసారు. 2013-2014 రాష్ట్ర బడ్జెట్‌లో 16 వేల కోట్లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి ఖర్చు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో వున్న నిరుపేదలైన ఎస్సీ,ఎస్టీలను దగా చేస్తూ ఆ నిధులన్ని దారిమళ్ళించి మోసగిస్తున్నారని ఆరోపించారు. సమైక్యాంధ్ర ఉద్యమన్ని బూచిగా చూపి మార్చి నెల వస్తున్నా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కాని, ఐటిడిఏ ద్వారా కాని ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా మోసగించడం శోచనీయమన్నారు. చేతులు మారిన సిజెఎస్‌ఎఫ్ భూములను భూస్వాముల చేతుల నుండి విడిపించి ఎస్సీ, ఎస్టీలకు స్వాధీనం చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాసులు, సంఘం సభ్యులు అరవ సుందరరాజు, అంచపాక నాగరాజు, దార్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనేతాజీలో ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ



వృత్త్యంతర శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నెల్లూరు విజయమహల్ గేటు దగ్గర శ్రీనివాస అగ్రహారంలో గల శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్ ఉపాధ్యాయులకు ఈ నెల 15న నెల్లూరు మండల విద్యాశాఖధికారి రమేష్‌బాబు వృత్త్యంతర శిక్షణనిచ్చారని హైస్కూల్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. నేటి విద్యా విధానంపై విద్యార్థుల మానసిక స్థితిగతులపై అవగాహన ఏర్పరచి, ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేసారని తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎమ్.ప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ డి.వాణి, ప్రధానోపాధ్యాయులు వి.సుధాకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### సిఐడి డీఐజీగా బదిలీ అయిన

# రామకృష్ణకు ఆత్మీయ వీడ్కోలు



నెల్లూరుజిల్లా ఎస్పీగా పనిచేస్తూ తక్కువకాలంలోనే ఉద్యోగోన్నతిపై సిఐడి డీఐజీగా బదిలీ అయిన పివియస్ రామకృష్ణకు నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో ఏఆర్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. అనతికాలంలోనే ఎస్పీగా రామకృష్ణ మంచి పేరు సంపాదించుకున్నారు. ఏఆర్ సిబ్బంది కవాతు నిర్వహించి ఆయనకు గౌరవ వందనం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించగలిగానని, ఎన్నో సవాళ్ళను అధిగమించగలిగానని తెలిపారు. పోలీసులు విధుల్లో పనివత్తిడి వున్నప్పటికీ తమ కుటుంబాల పట్ల అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. పిల్లల విద్యపట్ల జాగ్రత్త వహించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. జిల్లాలో పోలీసు సంక్షేమం కోసం తన వంతు కృషిచేసానని, డైబ్బైకోట్ల రూపాయలతో ముప్పై ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇవన్నీ త్వరలోనే పోలీసు సిబ్బందికి అందుబాటు లోకి వచ్చేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు, డీఎస్పీలు పి.వెంకనాథ్‌రెడ్డి, వియస్ రాంబాబు, శివారెడ్డి, శ్రీనివా సరావు, ఆర్ఐలు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సిఐలు రాజశేఖర్‌రెడ్డి, కె.వి.రత్నం, రామారావు, మంగారావు, జయరామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# స్వయం కృషితోనే అభివృద్ధి సాధించవచ్చు

**-డాక్టర్ ఎస్.హరిబాబు**



జ్ఞాపికనందుకుంటున్న డా॥ హరిబాబు

కేవలం తరగతి గదిలో పాఠాలు విని వల్లె వేయడం కాకుండా స్వయంకృషితో ప్రయత్నం చేసిన ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిష్టించుతాడని ప్రపంచ ప్రఖ్యాత "డూపాండ్" ప్రయోగశాలలో పనిచేస్తున్న నెల్లూరు విఆర్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ ఎస్.హరిబాబు పేర్కొన్నారు. నెల్లూరు విఆర్ కాలేజీ సెమినార్ హాల్‌నందు ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి పరిస్థితిని బట్టి సరైన సమయంలో మంచి నిర్ణయంతీసుకుని ముందుకుపోవాలి, అలా ముందుకు పోయి నేను ఈరోజు ఇంతస్థాయికి చేరుకోగలిగాను అని హరిబాబు అన్నారు. ప్రతి ఒక్కరిలోని మేధాసంపత్తి ఉంటుంది, దానిని సక్రమంగా వినియోగించి దేశ అభివృద్ధికి కృషిచేస్తూ మనం ఎదగాలని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుండే కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ చర్చలులాంటి కార్యక్రమంలో పాల్గొని ఎంతో విజ్ఞానం సంపాదించుకొనవచ్చునని అన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విఆర్‌కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ మాట్లాడుతూ విఆర్ కాలేజీలో బీఎస్సీ చదివిన విద్యార్థి నేడు ప్రపంచస్థాయిలో ఒక శక్తిగా ఎదగడం గర్వించదగ్గ విషయమన్నారు. అమెరికన్ సొసైటీ వారి నేషనల్ అవార్డునందుకున్న హరిబాబు ఇప్పటివరకు 130కి పైగా పేటెంట్ హక్కులు పొంది ఉన్నాడని తెలియచేశారు. ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ యం.సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా అధ్యాపకులు డాక్టర్ ఎ.వి.రంగారెడ్డి, డాక్టర్ యం.పద్మప్రియ, అమరా వెంకటేశ్వరరావు, బి.వేమారెడ్డి, వి.వి.కృష్ణశర్మ, డాక్టర్ పి.మల్లిఖార్జునరెడ్డి, డాక్టర్ కె.అశోక్‌రావు, హనుమంత్‌కుమార్, డాక్టర్ ఎస్.బాబర్‌ఆలీమొహిద్దీన్, ఎ.వేణునాథన్, బి.హరిప్రసాద్ మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. చివరిగా శాస్త్రవేత్త హరిబాబును ఘనంగా సత్కరించారు.

### నెల్లూరు పార్లమెంటుకు ఆదాల

# తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ

ఆదాల ప్రభాకరరెడ్డి సొంతగూటికి చేరిపోతున్నాడు. 1999లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అల్లూరు నియోజకవర్గం నుండి పోటీ చేసిన ప్రభాకరరెడ్డి తరువాత మంత్రిగా కూడా పనిచేశారు. 2004లో డా॥రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో 2004, 2009లలో వరుసగా విజయం సాధించాడు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌తో విభేదించి లోక్‌సభలో బిల్లు పెట్టడానికంటే ముందుగానే కాంగ్రెస్ పార్టీకి ఆ తరువాత శాసనసభ్యత్వానికి రాజీనామా చేసేశాడు. మొన్న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి అన్ని పార్టీల వారికీ చెమటలు పట్టించి చివరి నిముషంలో వైదొలిగి టిక్కువరపు సుబ్బరామిరెడ్డికి మద్దతుగా తన ఓటును వేశాడు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి స్వంత పార్టీ పెట్టి వుంటే బహుశా జిల్లా పెత్తనం ఆదాలదే అయ్యుండేది. కానీ కిరణ్‌కుమార్‌రెడ్డికి అంత సీన్ లేకపోవడంతో మళ్ళీ తన స్వంత గూడు తెలుగుదేశం పార్టీలో చేరి రానున్న ఎన్నికలలో నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ పక్షాన పోటీచేయనున్నాడు. ఫిబ్రవరి 28నగాని లేదా మార్చి 2నగానీ నెల్లూరులో జరిగే ప్రజాగర్జనలో ఆయన తెలుగుదేశం అభ్యర్థిగా అధికారికంగా ప్రకటన జరిగే అవకాశాలు వున్నాయి.

# శ్రీశైల మల్లన్న సేవకి ఆదినారాయణుడు

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మహిమాన్విత శైవక్షేత్రం, కర్నూలుజిల్లా శ్రీశైలం లోని శ్రీశైలభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా నెల్లూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దానగుణ సంపన్నులు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ప్రమాణస్వీకారం చేసారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేముందు కిరణ్‌కుమార్‌రెడ్డి శ్రీశైలం దేవస్థానం బాధ్యతను ఆల్తూరు ఆదినారాయణరెడ్డికి అప్పగించారు. రాష్ట్ర మాజీఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే, మాజీమంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డిలు ఆయనకు ఈ పదవి రావడానికి సహకరించారు. గత పాలక మండలిలో ఆల్తూరు ఆదినారాయణరెడ్డి సభ్యులుగా వుండి ఆలయంలో జరిగే గోపుర నిర్మాణ పనులకు 3కోట్ల రూపాయలు సొంత నిధులిస్తానని ప్రకటించారు. ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, వారి కుమారులు, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు మహేష్‌రెడ్డి, గిరీష్‌రెడ్డిలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కోట్లాదిరూపాయల విరాళాలనిచ్చారు. 11కోట్లతో షిరిడిలో సాయినాథునికి స్వర్ణసింహాసనం చేయించడంతో పాటు మరో 6కోట్లతో స్వర్ణ తాపడం చేయించారు. మన రాష్ట్రంలో శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాలలో అభివృద్ధి పనులకు భారీగా విరాళాలిచ్చారు. ఇక నెల్లూరుజిల్లాలో అన్ని గుళ్లలో అభివృద్ధి పనులకు ఆల్తూరు కుటుంబ దాతృత్వం మరువలేనిది. నెల్లూరు నగరంలో శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం, శ్రీమూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, శ్రీరంగనాథస్వామి దేవస్థానం, చిల్డ్రన్స్ పార్క్ సాయిబాబా మందిరం, రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానాలలో అభివృద్ధి పనులకు గాను భారీగా నిధులిచ్చి తమ దైవభక్తిని చాటుకున్నారు. వారి భక్తికి కరుణించేనేమో శివుడు తనకు సేవ చేసుకునే భాగ్యాన్ని ఆదినారాయణరెడ్డికి కల్పించాడు.

# ఆత్మీయంగా శివారెడ్డికి 'ఈదూరు' పురస్కారం

నెల్లూరు సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈనెల16న నెల్లూరు ఐఎంఏ హాలులో ఈదూరు సుబ్బయ్య సాహిత్య పురస్కారసభ జరిగింది. సభకు డా॥ ఈదూరు సుధాకర్ అధ్యక్షత వహించగా ప్రముఖకవి ఈతకోట సుబ్బారావు ఆహ్వానం పలికారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత, ప్రఖ్యాత వచనకవి, విమర్శకులైన కె.శివారెడ్డిని రూ॥10వేల నగదు, శాలువా, గంధపుమాల, జ్ఞాపిక, 18పర్వాల మహాభారత గ్రంథాలతో ఈదూరు సుబ్బయ్య సాహిత్యపీఠం నిర్వాహకులు ఈదూరు శేషయ్య, డా॥ ఈదూరు సుధాకర్, ఈదూరు రవికుమార్, సాహితీమిత్రమండలి అధ్యక్షులు చిన్ని నారాయణరావు, సభ్యులు ఈతకోట సుబ్బారావు, ఏటూరు నాగేంద్రరావు, వంజవాక సతీష్‌కుమార్‌రెడ్డి, అతిథులు మెట్టు రామ చంద్రప్రసాద్, బి.వి.నరసింహంలు ఘనంగా సత్కరించారు.

పురస్కార గ్రహీత కె.శివారెడ్డి మాట్లాడుతూ అసలు సాహిత్యకారుడు మాటకీ, చేతకీ వైరుధ్యం లేకుండా మనగలగాలి. మహాత్మాగాంధీ అన్నట్లుగా "ఏది నమ్ముతామో అది చెయ్. ఏది చేస్తామో అదే చెప్పు" అనే విధంగా రచయిత వుండగలిగినప్పుడే అతని సాహిత్యం పదికాలాల పాటు మనగల్గుతుందని అన్నారు. రచన అంటే బంగారాన్ని ఆకురాయి మీద పరీక్షిస్తే అసలో, నకిలీయో తెలిసినట్లు, రచన చదివితే అది ఆకురాయి అయి పాఠకుడిని నిగ్గు తేల్చగలగాలి. పుటంపెట్టి నికార్సయిన బంగారాన్ని తేల్చినట్లు తేల్చగలగాలి అన్నారు. అలాగే పఠనం ఒక సాధనం. మంచి రచన రావాలంటే విస్తృతమైన పఠనం ఉండాలి. ఆర్థికపరిపుష్టి, ఆధునిక వసతులే కాదు మానసిక ఆనందమూ జీవితావసరమే. అందుకు పఠనం ముఖ్యసాధనం. అన్నీ ముక్కలు ముక్కలుగా విచ్చిన్నమైపోతున్న రోజుల్లో, మనిషి ప్రతిదానినీ అలవాటుగా మార్చు కుంటున్న సందర్భంలో బతికి ఉండే క్షణాల కోసం మనల్ని మనం అధ్యయనం చేసుకోవాలి. అలా సమాజం మొత్తాన్ని ఆలోచింపజేసేది సాహిత్యం. అలాంటి సృజనకు రచయిత ప్రయత్నం చేయాలన్నారు. తదుపరి గుంటూరుజిల్లా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి కోసూరి రవికుమార్ వందనసమర్పణ చేసారు.



రాష్ట్ర విభజన బిల్లు లోక్‌సభలో ఆమోదించడాన్ని నిరసిస్తూ ఈ నెల 19న సూళ్లూరుపేటలో బంద్ నిర్వహిస్తున్న వైకాపా సూళ్లూరుపేట సమన్వయకర్త కె.సంజీవయ్య, వైకాపా కార్యకర్తలు

# ప్రజాస్వామ్యానికి ఉరేసారు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు మనుషులను హత్యచేయడం చూసాంగాని వ్యవస్థలను హత్యచేయడం తొలిసారిగా చూసాము. ఈ నెల 18వ తేదీన భారత రాష్ట్రపతి సాక్షిగా, స్పీకర్ సమక్షంలో 544మంది సభ్యులు చూస్తుండగా ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను నిలువునా నరికేసింది కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం. ఇక్కడ విచిత్ర మేంటంటే అధికారపక్షం దొడ్డదారిపట్టి ప్రజాస్వామ్యాన్ని నరకడానికి మొద్దుకత్తి పడితే దానిని అడ్డుకోవాల్సిన ప్రతిపక్షం కనీస ధర్మాన్ని విస్మరించి ఈ హత్యకు సహకరించడం.

ఈ నెల 18వ తేదీన లోక్‌సభలో, 20వ తేదీన రాజ్యసభలో చారిత్రాత్మక తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది. దీంతో ఎన్నో ఏళ్ల తెలంగాణ వాదుల పోరాటం ఫలించినట్లయ్యింది. ఆరు దశాబ్దాలుగా ఒకే జాతి, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే రాజ్యం అన్నట్లుగా వున్న తెలుగు మనుషులు రెండు రాష్ట్రాలుగా, రెండు ప్రాంతాలుగా విడిపోయారు. తెలంగాణ ప్రజల కోరిక మేరకు వాళ్లకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చే ప్రక్రియను ఎవరూ తప్పు బట్టరు. కాని అందుకు కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాయడానికి తెగించింది. తెలంగాణలో వున్న 17ఎంపీ సీట్ల కోసం 5కోట్ల సీమాంధ్ర ప్రజల బ్రతుకులను, భవిష్యత్తును పణంగా పెట్టింది. సభా సంప్రదాయాలను మంటగలిపింది. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కింది. బిల్లుకు ఎవరైనా అడ్డంపడితే వాళ్లను ఖూనీచేసైనా నెగ్గించుకోవాలనే కసితో ముందుకుపోయింది.

ఈ నెల 14వ తేదీ లోక్‌సభలో జరిగిన సంఘటనలతోనే పార్లమెంట్ పరువుపోయింది. అజెండాలో చూపకుండానే, అదనపు అజెండాలో చేర్చకుండానే కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్‌షిండే గందరగోళం మధ్య టీ–బిల్లును ప్రవేశపెట్టారు. ఆయన బిల్లు పెట్టినట్లు, స్పీకర్ అంగీకరించినట్లు కూడా తమకు తెలియదని విపక్షాలే విమర్శించాయి. ఆరోజు బిల్లును అడ్డుకోబోయిన సీమాంధ్ర ఎంపీలను కాంగ్రెస్ ఎంపీలు చావగొట్టడం, లగడపాటి రాజగోపాల్ పెప్పర్‌స్ప్రే వదలడం వంటి సంఘటనలతో పార్లమెంటు ప్రతిష్ఠ దిగజారింది. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన స్పీకర్ సైతం నిబంధనలను పక్కన పెట్టి అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరించిన తీరు విమర్శలపాలయ్యింది. వెల్‌లోకి 50మంది సభ్యులు దూసుకొస్తే కక్షకట్టినట్లుగా సీమాంధ్ర సభ్యులనే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ అధికార అహంకారానికి నిదర్శనం. ఆరు నెలలుగా సీమాంధ్రులు నెత్తినోరు బాదుకుంటున్నా విభజన మంటలో ఎందరో సీమాంధ్రుల గుండెలు ఆగినా, ఉద్యోగులు జీతాల్లేక జీవితాల కోసం గల్లీ నుండి ఢిల్లీ దాకా పోరాడినా కేంద్రం ఏ మాత్రం చెవికెక్కించుకోలేదు. విభజనలో సమన్యాయం, కనీసధర్మం పాటించలేదు. 5కోట్ల మంది సీమాంధ్రులను నడిరోడ్డున వదిలేస్తున్నామనే ఇంగిత జ్ఞానం కూడా లేదు. ప్రధాన ప్రతిపక్షం బీజేపీ చేసిన సవరణలను సైతం పట్టించుకోకుండా, సీమాంధ్రకు తీరని అన్యాయం చేస్తూ, తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నరీతిలో రూపొందించిన విభజన బిల్లును 18వ తేదీ లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించడం జరిగింది. చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన ఈ బిల్లుపై కేవలం 23నిముషాలే చర్చ జరుగగా షిండే, సుష్మాస్వరాజ్, జైపాల్‌రెడ్డిలు మాత్రమే మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందడానికి ముందు లోక్‌సభ టీవీ ప్రత్యక్ష ప్రసారాలు నిలిపివేయడం, పార్లమెంట్ తలుపులు మూసివేయడం చూస్తే ఎమర్జెన్సీ గుర్తుకు వచ్చింది. పార్లమెంటు హాల్‌లో ఎవరినో ఉరితీస్తున్నట్లనిపించింది. తీరా చూస్తే అక్కడ ఉరితీసింది ప్రజాస్వామ్య విలువలను, 5కోట్ల సీమాంధ్ర ప్రజల భవిష్యత్‌నని లోకానికి వెల్లడైంది. పార్లమెంటులో ప్రధానపక్షాలే ప్రజాస్వామ్యాన్ని తగలబెట్టడానికి నిరసనగా తృణమూల్‌కాంగ్రెస్, సీపీఎం, బిజెడి, జెడియూ వంటి పార్టీలు సభను బహిష్కరించాయి.

**ఆద్యంతం ఉత్కంఠ...**

టీ–బిల్లు ఆమోదం భారత్– పాకిస్థాన్‌ల మధ్య జరిగే టీ–20మ్యాచ్‌నే తలపించింది. అధికార కాంగ్రెస్‌పార్టీ తొలి నుండి ఎలాగైనా టీ–బిల్లును గట్టెక్కించాలనే పట్టుదలతో పనిచేసింది. అయితే ప్రధాన ప్రతిపక్షం బీజేపీనే డబుల్ రోల్ ప్లేచేసింది. సీమాంధ్రులకు న్యాయం చేస్తేనే టీ–బిల్లుకు మద్దతిస్తామంటూ కొన్ని సవరణలు ప్రతిపాదించింది. కాని కేంద్రం ఈ సవరణలను కూడా పట్టించుకోలేదు. బీజేపీ సవరణల కోసం పట్టుబడితే బిల్లు ఆగడానికి అవకాశం ఉందని సీమాంధ్రులు ఎంతో ఆశగా ఎదురుచూసారు. బిల్లు పెట్టే రోజు కూడా సీమాంధ్ర సమస్యలు పరిష్కరిస్తేనే బిల్లుకు మద్దతిస్తామని వెంకయ్యనాయుడు, మూజువాణి ఓటుతో బిల్లును అంగీకరించేది లేదని అద్వానీ ఘంటాపథంగా చెప్పడంతో సీమాంధ్రులలో ఆశలు చిగురించాయి. బిల్లు ఆమోదం పొందినా కనీస న్యాయం జరుగుతుందేమోననుకున్నారు. తీరాచూస్తే లోక్‌సభలో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై తెలంగాణ రాష్ట్రానికి ఊపిరి పోసి, 5కోట్ల సీమాంధ్రుల ఉసురు తీసాయి. 20వ తేదీ రాజ్యసభలోనూ ఈ రెండు పార్టీల పరస్పర సహకారంతోనే టీ–బిల్లు ఆమోదం పొందింది. కాకపోతే గుడ్డిలో మెల్లలా అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడులు కేంద్రంతో పోట్లాడి ప్రధాని ద్వారా సీమాంధ్రకు కొన్ని హామీలు ఇప్పించడం కంటి తుడుపు. టీ–బిల్లు ఆమోదంతో తెలంగాణ అంతటా ఆనందం... సీమాంధ్ర అంతటా ఆందోళన. అక్కడ సంతోషం... ఇక్కడ విషాదం. అక్కడ బాణాసంచా వెలుగులు... ఇక్కడ దిష్టిబొమ్మల దహనాలు. అక్కడ పిండివంటలు... ఇక్కడ గుండె మంటలు. తెలుగుతల్లికి ఒక కంట కన్నీరు... మరో కంట ఆనంద భాష్పాలు.

ఒకప్పుడు

*తెలుగుజాతి మనది...*

*నిండుగ వెలుగుజాతి మనది.*

ఇప్పుడు

*తెలుగుజాతి మనది*

*రెండుగ చీలిన జాతి మనది.*

# కెప్టెన్ రిటైర్డ్ హర్ట్

(మొదటిపేజీ తరువాయి)

కావడం ఆయనకు కలిసొచ్చింది. అయితే సీఎంకావడంతోటే తన మార్క్ పరిపాలనకు ఆయన తెరతీసాడు. మంత్రి పదవుల కేటాయింపులోనే కొందరిని దూరం చేసుకున్నాడు. పార్టీలో చాలా మందికంటే కిరణ్ జూనియర్ కావడంతో ఆయన సీఎం కావడాన్ని కొందరు సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. కిరణ్ ఇదేమీ పట్టించుకోకుండా తనపని తాను చేసుకుపోయాడు. తెలంగాణలో సకలజనుల సమ్మెను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. హైదరాబాద్‌లో ఎంఐఎం నేతలకు చుక్కలు చూపించాడు. పరిపాలనలో గట్టిగా వ్యవహరించాడు. ప్రజలలో సొంత ఇమేజ్ లేకపోయినా ప్రభుత్వంపై పట్టు సాధించే ప్రయత్నాలలో ఉండగానే కాంగ్రెస్ తెలంగాణ బిల్లును ముందు తెచ్చిపెట్టింది. అప్పటి నుండి కిరణ్‌కు సమస్యలు మొదలయ్యాయి. సీమాంధ్ర ప్రజల భవిష్యత్‌ను పట్టించుకోకుండా ఏకపక్షంగా బిల్లును ఎలా చేస్తారంటూ అధిష్ఠానం పైనే ఎదురుదాడికి దిగాడు. విభజనతో వచ్చే సమస్యలకు పరిష్కారాలేంటని కేంద్రాన్ని ప్రశ్నించాడు. విభజన ప్రక్రియ మొదలైనప్పటి నుండి కూడా అధిష్ఠానం వర్సెస్ కిరణ్ అన్నట్లుగా పరిస్థితి మారింది. రాష్ట్రపతి పంపిన టీ–బిల్లును అసెంబ్లీలో మూజువాణి ఓటుతో తిరస్కరించి పంపడం ద్వారా కిరణ్ అధిష్ఠానానికి మరింతగా ఎదురు తిరిగినట్లయ్యింది. సమైక్యవాదానికి కట్టుబడ్డానంటూ అసెంబ్లీకి పంపిన బిల్లునే పార్లమెంటులో పెడితే రాజీనామాచేస్తానని కిరణ్ శపథం చేసాడు. విభజనపై చివరిబంతి ఇంకా మిగిలి ఉందంటూనే ఆశతో ఇంతదాకా వచ్చారు. 18వతేదీ లోక్‌సభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంతో ఇక విభజన ఖాయమని నిర్ధారించుకున్న ఆయన రాజీనామా బాట పట్టారు. రిటైర్డ్ హర్ట్‌గా ఆట నుండి తప్పుకున్నాడు.

**తక్షణ కర్తవ్యం:** కిరణ్ తదుపరి కార్యాచరణ సొంతంగా పార్టీ పెట్టడమే. కాంగ్రెస్ అధిష్ఠానంతో ఇంతగా తలపడ్డాక మనసు చంపుకుని ఆ పార్టీలో ఉండలేడు. సీఎంగా పనిచేసాడు కాబట్టి ఇంకో ప్రాంతీయ పార్టీలోకి పోలేడు. ఆయన ముందున్న మార్గం సొంతంగా పార్టీని పెట్టడమే. విభజన బిల్లుతో కాంగ్రెస్‌పార్టీ సీమాంధ్ర ప్రజలనే కాదు, సీమాంధ్రలోని కాంగ్రెస్ నాయకులను కూడా అనాథలను చేసింది. వీరందరికీ ఒక కొత్త రాజకీయ వేదిక కావాలి. కాంగ్రెస్‌లో ఉండలేరు. బీజేపీలోకి పోలేరు. తెలుగుదేశం, వైసిపిలలో ఖాళీలు లేవు. కాబట్టి కొత్తపార్టీయే శరణ్యం. పలువురు మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు కిరణ్ సారథ్యంలో నడవడానికి సిద్ధంగా ఉన్నారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో కొత్త పార్టీ ద్వారా తన వర్గానికి భరోసా ఇవ్వవలసి వుంది. మరి ఈ కెప్టెన్ అంతటి సాహసం చేస్తాడా, తన జట్టుకు అండగా నిలుస్తాడా అన్నది వేచిచూడాల్సిందే!


# అల్లీపురం స్కూల్ వార్షికోత్సవం



అల్లీపురంలోని శ్రీ పొక్కిరెడ్డి సేతురామిరెడ్డి మెమోరియల్ ఎలిమెంటరీ మరియు ఉర్దూ పాఠశాల 5వవార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 18న స్కూల్ పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సేతురామిరెడ్డి మనుమలు నిరంజన్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, సనత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా మొదలైన శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం దక్షిణ కైలాసంగా వెలుగొందుతోంది. పల్లవ, చోళ, విజయనగర రాజులకాలపు శిల్పకళా నైపుణ్యం ఈ క్షేత్రంలో ప్రస్ఫుటమవుతోంది. 1516లో శ్రీకృష్ణదేవరాయులు తన దక్షిణ భారతదేశ విజయయాత్రకు చిహ్నంగా పెద్ద గాలిగోపురంతోపాటు ఆలయంలోని నూరుకాళ్ళ మండపాన్ని కూడా నిర్మించారు. దేవాలయంలో వైదిక ఆగమ విధానంలో పంచ పూజలు జరుగుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడుసార్లు అభిషేకాలు, సాయంత్రం ప్రదోష కాలాన ఒక అభిషేకంతోపాటు మొత్తం నాలుగు కాలాల అభిషేకాలు కొనసాగుతున్నాయి. ప్రతియేటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయంలో అత్యంత ప్రధానమైనవి. ఈశ్వరుని ఆన మేరకు బ్రహ్మదేవుడు కైలాసాన గల శిఖరాలలో ముఖ్యమైన శివానందైక నిలయమును శిఖరాన్ని శ్రీకాళహస్తి క్షేత్రంలో స్థాపించి శివుని అనుగ్రహం పొందారని పురాణాలు చెబుతున్నాయి. తద్వారా శ్రీకాళహస్తికి దక్షిణకైలాసమనే పేరు వచ్చింది. ఆలయాన్ని ఆనుకొని సువర్ణముఖినది పట్టణానికి ఉత్తర వాహిణిగా ప్రవహిస్తోంది. ఆలయంలోని తిరుమంజున గోపురానికి ఎదురుగా మణికర్ణికా స్నానఘట్టాలు ఉన్నందున ఈ క్షేత్రాన్ని దక్షిణకాశి అని పిలుస్తారు. శ్రీకాళహస్తి ఆలయ నిర్మాణంలో ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో వినాయకుడు, శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనా దేవి, దక్షిణామూర్తి వీరందరూ ఒక్కొక్కరు ఒక్కో దిశలో వెలసిఉన్నారు. జీవులు తరించడానికి మూలమగు ధర్మం, అర్థం, కామం, మోక్షం చతుర్విధ పురుషార్థాలకు సూచనగా ఈ ఆలయాన్ని నిర్మించారన్నది పూర్వీకుల నమ్మకం. తూర్పున జ్ఞానాన్ని ప్రసాదిస్తూ జ్ఞానప్రసూ నాంబికాదేవి, పడమటి దిక్కున శ్రీకాళహస్తీశ్వరుడు, దక్షిణాన దక్షిణామూర్తి, ఉత్తర దిక్కున వినాయకుడు ఉండేలా ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయంలోని శిల్పకళ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుం టోంది. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆలయం ఉంది. శ్రీకాళహస్తీశ్వరుడు స్వయంభువు. శ్రీ అనగా సాలె పురుగు, కాళ అనగా పాము, హస్తి అనగా ఏనుగు. ఈ మూడు జీవులు శివభక్తి వల్ల ముక్తిపొంది పరమేశ్వరునిలో ఐక్యమయ్యాయి. అప్పటివరకు సత్యవ్రత భాస్కర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశానికి శ్రీకాళహస్తి అని పేరు వచ్చింది.



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాలు 22వ తేది నుంచి ప్రారంభమయ్యాయి. 22వ తేది భక్త కన్నప్ప ధ్వజారోహణము, 23వ తేది శ్రీ స్వామివారి ధ్వజారోహణము, 24వ తేది రెండవ తిరునాళ్ళు, 25వతేది మూడవ తిరునాళ్లు, 26వతేది నాలుగవ తిరునాళ్లు, 27వ తేది మహాశివరాత్రి, 28వ తేది రథోత్సవము, మార్చి 1న కళ్యాణోత్సవము, 2వతేది సభాపతి కళ్యాణం, 3వతేది కైలాసగిరి ప్రదక్షిణము, 4వ తేది తీర్థవారి ( ధ్వజారోహణము ), 5వ తేది పల్లకీసేవ, 6వ తేది ఏకాంతసేవతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వణాధికారి పూర్ణచంద్రరావు తెలిపారు.

పంచభూత లింగాలలో శ్రీకాళహస్తి వాయులింగంగా పేరు గాంచింది. కృతయుగంలో శ్రీకాళహస్తీశ్వరుని మహాయోగులు మాత్రమే తాకేవారు. త్రేతాయుగంలో స్వర్ణరూపంలోనూ, ద్వాపర యుగంలో రజత రూపంలోనూ, ప్రస్తుత కలియుగంలో శ్వేత శిలారూపంలో వెలసియున్నారు. వాయులింగానికి నిదర్శనంగా శ్రీ స్వామివారి గర్భాలయంలో కుడివైపున ఉన్న దీపాలు రెండూ ఎల్లప్పుడూ చలిస్తుండడం గమనించదగిన విషయం. ఆలయంలోని తక్కిన దీపాలన్నీ నిశ్చలంగా ఉన్నప్పటికీ గాలి సోకడానికి ఎలాంటి ఆస్కారం లేకపోయినా కుడివైపున ఉన్న రెండు దీపాలు మాత్రం ఎల్లప్పుడూ చలిస్తూ ఉంటాయి. స్వామి ఉచ్చాస, నిశ్వాసాల వల్ల దీపాలు చలిస్తుంటాయని చెబుతుంటారు.

## నవగ్రహ కవచం ప్రాధాన్యత

శ్రీకాళహసి క్షేత్ర మహిమలో స్వామికి అలంకరించే నవగ్రహ కవచానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఇది బంగారు కవచం. ఈ క్షేత్రంలో తప్ప మరే ఇతర శివాలయాల్లోనూ శివలింగానికి స్వర్ణకవచం ఉన్న దాఖలాలు లేవు. ఈ కవచం తొలగిస్తే తప్ప స్వామి అసలు స్వరూపం కనబడదు. ఈ శివలింగానికి అవతల సూర్య విగ్రహం ఉంది. ఈ స్వామికి అలంకరించే నవగ్రహ కవచాన్ని తొలగించి తనకు సత్యదర్శనమివ్వమంటూ స్వామిని దర్శించుకోవడానికి వీలుగా అక్కడ సూర్య విగ్రహం ప్రతిష్ఠితమైందని చెబుతారు. పుత్రశోకాన్ని భరించలేక మతిభ్రమించిన వశిష్ఠ మహర్షి శివునికి తప్పస్సు చేయగా శివుడు పంచముఖ వాయులింగేశ్వరుడుగా దర్శనమిచ్చి శోక విముక్తుని చేశారని మరో కథలో పేర్కొనబడి ఉంది.

---

# గూడూరు డివిజన్ వార్తలు



## గనుల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

### రైతుకులీ సంఘం నాయకులు



ఆర్డీవో మధుసూధనరావుకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

గూడూరు డివిజన్‌లోని సైదాపురం మండలం తుమ్మల తలుపూరు మైనింగ్ పేరిట లీజులు పొందిన వారు గుడువు పూర్తయినా అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని గూడూరు ఆర్డీవో మధుసూధన్‌రావును సోమవారంనాడు కలసి గ్రామస్థులు అర్జీ సమర్పించారు. ఈ నెల 13వ తేదీన తుమ్మల తలుపూరులో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారని అన్నారు. గనుల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఓటింగ్ ద్వారా గ్రామస్థులు తీర్మానించారు. గ్రామస్థులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఆర్డీవోను కోరింది. ఆర్డీవో స్పందించి ఈ విషయాన్ని పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

సోమవారం రైతుకూలీ సంఘం జిల్లా సమన్వయకర్త పోలయ్య ఆధ్వర్యంలో వందలాదిమంది బాధితులు పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ డివిజన్ కార్యదర్శి కటికాల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది గూడూరులో భారీర్యాలీ నిర్వహించి ఆందోళనలు చేశారు. కనీసం వేతనం రూ.10వేలు ఇవ్వాలని పింఛను సహా పదవీ విరమణ ప్రయోజనాలు వర్తింపజేయాలని అన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి ఆ తరువాత ఆందోళనలు చేపట్టారు.

## దామోదర్ జోషి మృతికి సంతాపం

సమైక్య రాష్ట్రం కోసం ఢిల్లీ ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లిన మనుబోలు మండలం ఎంపీడీవో కార్యాలయాధికారి, ఏపీ ఎన్జీవో జిల్లా ప్రతినిధి దామోదర్‌జోషి గుండె పోటుతో మృతి చెందడం పట్ల గూడూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సోమవారం సంతాపం తెలిపారు. సమైక్య ఉద్యమంలో తొలి నుంచి పోరాడుతున్న జోషి అకాలమరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నిర్మలాదేవి, కార్యాలయాధికారి చంద్రశేఖర్, ఏఈ అజీమ్, కార్యదర్శులు చిరంజీవి, వెంకటరాము, రాంమోహన్, హరిప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

గూడూరులోని బజారువీధి వద్దగల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జి.ఎస్.రాయులు కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఉదయం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసారు. అనంతరం లోకకల్యాణార్థం తిరుమల తిరుపతి దేవస్థాన పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా చేసారు. ఈ కల్యాణంలో 101మంది దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు చేసారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌వ్యాలీ స్కూల్ 5వ వార్షికోత్సవం



వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న పి.సి.రెడ్డి, పక్కన సినీహీరో రాజా తదితరులు

గూడూరులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్ 5వ వార్షికోత్సవం ఈ నెల 16వ తేదీ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సినీదర్శకుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి, సినీనటుడు రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యతను నిర్వహించడం గొప్ప అవకాశమన్నారు. కన్నవాళ్లు కూడా తమ పిల్లలకు ఏ రంగం పట్ల ఆసక్తి వుందో దాన్ని గుర్తించి ప్రోత్సహించడం అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, ఆట పాటలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ కె.ఆర్.రెడ్డి, సినీనటి పువిషా, ప్రిన్సిపాల్ మైఖేల్‌సుకుమార్, ఏవో నరసింహారెడ్డి, హిమాలిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోటరీ ఉచిత నేత్ర వైద్యశిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రకాష్

గూడూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు ఈ నెల 16న రోటరీభవనంలో నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ ప్రకాష్ సహకారంతో ఈ వైద్యశిబిరంకు వచ్చిన ప్రజలకు ఉచిత నేత్రవైద్య పరీక్షలు చేసారు. ఈ పరీక్షల్లో 49మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఈ నెల 23వ తేదీన కళ్ల అద్దాలు పంపిణీ చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి నేత్రాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.మునిగిరీష్, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్యాకేజీ కుదిరింది.. సీన్ మారింది!



- సుష్మాస్వరాజ్ చక్రం తిప్పింది
- హీరో కావాల్సిన బీజేపీ విలన్ అయ్యింది

*ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతాపార్టీ ప్రాబల్యం తక్కువ. ఆ పార్టీ ప్రభావం అంతో ఇంతో తెలంగాణలో ఉందిగాని సీమాంధ్రలో లేదు. కాబట్టి ఆ పార్టీ తెలంగాణ నినాదాన్ని తలకెత్తుకోవడంలో తప్పు పట్టాల్సిందేమీ లేదు. ఇంకా చెప్పాలంటే కాంగ్రెస్‌ను పెంచిపోషిస్తూ వచ్చింది సీమాంధ్ర ప్రాంతమే. కానీ ఈ ప్రాంతానికే కాంగ్రెస్ తీరని ద్రోహం చేసింది.*

ఈ సమయంలో బీజేపీకి ఓ మంచి అవకాశం వచ్చింది. ఏ సీమాంధ్ర ప్రజలైతే కాంగ్రెస్‌పార్టీని ఆదరించారో, అదే కాంగ్రెస్‌పార్టీ ఏకపక్ష విభజనకు పూనుకుంటే, ఈ ప్రాంతంలో ఒక్క ఎమ్మెల్యే సీటయినా లేని బీజేపీ దీనిని అడ్డుకుంటామంటూ ముందుకొచ్చింది. సీమాంధ్రకు న్యాయం జరిగితేనే తెలంగాణ బిల్లుకు మద్దతంటూ చెప్పింది. బీజేపీ మాటలు చూసి సీమాంధ్రులలో ఎక్కడో నమ్మకం ఏర్పడింది. రాష్ట్రం చీలినా కనీసం బీజేపీ వల్లయినా న్యాయం జరుగుతుందనే ఆశ ఏర్పడింది. బిల్లు లోపభూయిష్టంగా వుందని అద్వానీ అంటే, విభజనను తప్పులతడకగా చేస్తున్నారని రాజ్‌నాథ్‌సింగ్ తప్పుపడితే, సీమాంధ్రుల సమస్యలు పరిష్కరించాకే తెలంగాణపై ముందుకెళ్లాలని వెంకయ్యనాయుడు హెచ్చరిస్తే... సీమాంధ్రులకు గుండెల నిండా ధైర్యం వచ్చింది. తాము ఓట్లేసి గెలిపించిన కాంగ్రెస్ తమను మోసం చేసినా, తాము ఏనాడూ ఓటేయని బీజేపీ అండగా నిలిచినందుకు ఆ పార్టీని కృతజ్ఞతాభావంతో చూసారు. ఎన్నికలప్పుడు సీమాంధ్రలో బీజేపీ ఉనికే కనిపించదు. అలాంటిది లోక్‌సభలో బిల్లు పెట్టే ముందురోజులన్నీ కూడా సీమాంధ్రలోని ప్రతిఒక్కరూ బీజేపీని గురించే చర్చించుకున్నారు. ఇదివరకే నరేంద్ర మోడీ పట్ల క్రేజ్ వుండడంతో, విభజన బిల్లు విషయంలో ఆ పార్టీ సీమాంధ్రకు న్యాయం చేసి వుంటే ఇక్కడ ప్రజల దృష్టిలో హీరోగా నిలిచి ఉండేది. కాని వాళ్లు చెప్పిందొకటి, లోక్‌సభలో జరిగిందొకటి. సీమాంధ్రకు న్యాయం చేయాలంటూ 32సవరణలను ప్రతిపాదించిన ఆ పార్టీ, లోక్‌సభలో ఏ సవరణలూ లేకుండానే ప్రవేశపెట్టిన బిల్లుకు బేషరతుగా మద్దతు తెలపడంతో సీమాంధ్ర గుండె పగిలింది. నమ్మించి బీజేపీ ఇంత మోసం చేస్తుందా అనే ఆగ్రహం పెల్లుబికింది.

లోక్‌సభలో ఏకపక్షంగా టీ-బిల్లుకు మద్దతు తెలపడానికి కారణమెవరు? దీని వెనుక నడిచిన తతంగమేంటి? ఈ వ్యవహారంలో బీజేపీ లోక్‌సభాపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ చక్రం తిప్పారు. ప్యాకేజీలు కుదిరాయి. మాటలు మారాయి. సవరణలతో పనిలేకుండా పోయింది. బీజేపీ అగ్రనేత అద్వానీకి ఈ తప్పులతడక బిల్లుకు మద్దతునివ్వడం అసలు ఇష్టం లేదు. కాని పార్టీలోనే కాదు లోక్‌సభలో కూడా ఆయన మాట చెల్లుబాటుకాలేదు. లోక్‌సభ పక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ కాబట్టి ఆమె మాటే నెగ్గింది. లోక్‌సభ ప్రాంగణంలోనే బిల్లు పెట్టే రోజు బేరాలు కుదిరాయి. ప్యాకేజీలు మాట్లాడుకున్నారు. కర్నాటక, ఆంధ్రాలో వున్న గనులను కొల్లగొట్టి, వేలకోట్లు గడించి, ఈరోజు జైలులో ఊచలు లెక్కపెడుతున్న గాలి జనార్ధన్‌రెడ్డి గురువు ఈ సుష్మాస్వరాజ్. కాబట్టి ఈమెది ఇంకెంత డేంజర్ మైండ్ అనుకోవాలి. అదీగాక తొలినుండి ఆమె తెలంగాణ పక్షపాతిగానే వ్యవహరిస్తుంది. 18వ తేదీ లోక్‌సభలో టీ-బిల్లుపై చర్చ మొదలు కాగానే పార్టీ నిర్ణయించిన సవరణలను ఆమె ప్రతిపాదించకుండా భేషరతుగా మద్దతు తెలిపింది. దీంతో టీ-బిల్లు ఎలాంటి మార్పు, సవరణలపై ఓటింగ్ లేకుండానే 23నిముషాలలో ఆమోదం పొందింది. టీ-బిల్లు ఇలా చీకటిలో ఆమోదం పొందడం చూడలేకే అగ్రనేత అద్వానీ 3గంటలకే సభ నుండి వెళ్లిపోయాడు.

లోక్‌సభలో సుష్మాస్వరాజ్ వ్యవహరించిన తీరుతో బీజేపీ నిందలపాలయ్యింది. ప్రజాస్వామ్యవాదులు కాంగ్రెస్‌తోపాటు బీజేపీని ఒకే గాటన కట్టేసారు. రెండు పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసాయంటూ విమర్శలు వెల్లువెత్తాయి. సుష్మాస్వరాజ్ చేసిన పనితో బీజేపీ శ్రేణులు కూడా బిత్తరపోయాయి. ముఖ్యంగా సీమాంధ్రలోని ఆ పార్టీ నాయకులకైతే అగ్రనేతలు సమాధానం చెప్పలేని పరిస్థితి వచ్చింది. దీంతో చేసిన తప్పును కొంతన్నా సరిదిద్దుకునే దిశగా 19వ తేదీ రాజ్యసభలో బిల్లు పెట్టినప్పుడు ఆ పార్టీ నాయకులు అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడులు కొన్ని సవరణలు ప్రతిపాదించారు. అయితే ఈ సవరణలను ఆమోదిస్తే బిల్లు తిరిగి లోక్‌సభకు పోవాల్సి రావడంతో కేంద్రం కంగారెత్తిపోయింది. బీజేపీ అగ్రనేతలతో చర్చలు జరిపి ప్రధానితో సీమాంధ్రకు పలు రాయితీలు కల్పించే విధంగా ప్రకటన చేయించడం ద్వారా ప్రతిష్టంభన తొలగించారు. దీంతో రాజ్యసభలోనూ టీ-బిల్లు ఆమోదం పొందింది.

అయితే సీమాంధ్రలో బీజేపీని మాత్రం విలన్‌గానే చూస్తున్నారు. కాంగ్రెస్ అంటే ఎలాగూ ముద్రపడిపోయింది. కాని బీజేపీ మాటను నిలబెట్టుకోలేదనే కసి సీమాంధ్రులలో ఉండిపోయింది. సుష్మాస్వరాజ్ ఏకపక్ష వైఖరితోనే సీమాంధ్రలో బీజేపీ శాశ్వత శత్రువుగా నిలిచిపోవాల్సివచ్చింది.

# కళ్యాణ వైభవం...!



పావని గ్రూప్ అధినేత, ఆంధ్రాబ్యాంక్ మాజీ ఉద్యోగి పి.వి.రాఘవరావు - శ్రీమతి పి.పావనిల కుమారుడు **శ్రీహర్ష - హరిణి** (హైదరాబాద్ వాస్తవ్యులు పెమ్మసాని పాండురంగారావు - సుధారాణిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 9వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్ నందు, రిసెప్షన్ వేడుకలు 12వ తేదీ నెల్లూరులోను వైభవంగా జరిగాయి. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



లక్ష్మీ స్కాన్ & ఎక్స్‌రే సెంటర్ అధినేత డా॥ గట్టు సుబ్బారావు - విమలల కుమార్తె **లక్ష్మి - డా॥ గురుచైతన్య కుమార్** (నెల్లూరు వాస్తవ్యులు చాగలకొండు గురుప్రసాదరావు - సుకన్యల కుమారుడు)ల వివాహం ఈ నెల 20వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# పెద్దల సభలో పడిపోయిన కె.వి.పి.

- ఆగ్రహించిన మెగాస్టార్
- వెంకయ్య కీలకరోల్
- మౌనంగా పనబాక

లోక్‌సభలో రాష్ట్ర విభజన బిల్లు కేవలం 23నిముషాల్లోనే ఆమోదం పొందినా, గురువారం రాజ్యసభలో మాత్రం ఆరోగ్యవంతమైన చర్చతో ఆమోదం పొందింది. 12పార్టీలు తెలంగాణ బిల్లును వ్యతిరేకించగా 8పార్టీలు ఆమోదించాయి. బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. సభలో చర్చ సందర్భంగా చిరంజీవి, వెంకయ్యనాయుడుల మధ్య సంవాదం చోటుచేసుకుంది. చిరంజీవి తన ప్రసంగంలో కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేయగా, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీలు అభ్యంతరం తెలిపారు. ఒక్క కేంద్రమంత్రి తమ ప్రభుత్వంపైనే విమర్శలు చేయకుండా రూలింగ్ చేయాలని వారు ఉపసభాపతిని కోరగా, అది సదరు మంత్రి నైతికతకు సంబంధించిన విషయమని ఉపసభాపతి చెప్పారు. 5రోజుల నుండి సభలో ప్లేకార్డు పట్టుకుని నిలబడిన కెవిపి గురువారం ఉన్నట్లుండి పడిపోయారు. కొద్దిసేపటికి కోలుకుని క్రింద కూర్చుని నిరసన తెలిపారు. కేంద్రమంత్రి హోదాలో సభకు హాజరైన పనబాక లక్ష్మి మాత్రం మిన్నకుండిపోయారు.




శుభాకాంక్షలు

దైవచింతనాపరులు, ఆధ్యాత్మిక సేవాతపస్వి,
ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భూరి విరాళాలిచ్చిన అభినవ దానకర్ణుడు
షిర్డితో పాటు ఎన్నో దేవాలయాలకు భూరి విరాళాలిచ్చిన దైవసేవాపరాయణులు
మానవత్వం, మంచితనం, కలబోసిన మనసున్న మా రాజు, మా పెద్దాయన
శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారు
శ్రీశైలభ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా
పదవీబాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా
మా హృదయపూర్వక శుభాకాంక్షలు.



షేక్ రియాజ్‌బాషా
హైదరాబాద్ లైటింగ్‌హౌస్ & హైరర్స్, నెల్లూరు.


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.